విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

శనివారం 14 సెప్టెంబరు 2024 8పేజీలు

సామాన్య ప్రజలే లక్ష్యంగా బ్యాంకు సేవలు

- రేపు చిత్తూరులో ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ 53వ బ్రాంచ్ ప్రారంభం
- రూ.100 కోట్లు అప్పులు ఇవ్వాలన్నదే బ్యాంకు లక్ష్యం
- బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు

వార్త మెయిన్‌లో

ఏచూరి మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సత్యనారాయణమూర్తి

వార్త మెయిన్‌లో

ఘోర రోడ్డు ప్రమాదం

- ఏడుగురు మృతి, ముప్పై మందికి గాయాలు
- ప్రమాదంపై ముఖ్యమంత్రి దిగ్భ్రాంతి
- మృతులకు ఐదు లక్షలు చొప్పున ఎక్స్ గ్రేషియా ప్రకటన

వార్త మెయిన్‌లో

ముక్కంటి ఆలయ అధికారులా... మజాకా

దేవదాయశాఖ కమిషనరు ఆదేశాలు బేఖాతరు



విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అధికార పార్టీ అండ చూసుకుని దేవదాయశాఖ కమిషనరు ఆదేశాలు బేఖాతరు చేస్తున్నారు. ఇలా చేయడం ముక్కంటి ఆలయంలో చర్చనీయాంశంగా మారింది. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయంలో ఇటీవల సెక్యూరిటీ (భద్రతా సిబ్బంది) టెండర్లు నిర్వహించారు. ఈ టెండరు దక్కించుకోవడానికి ఐదు మంది బిడ్ దాఖలు చేశారు. ఇందులో ముగ్గురు టెండరు దారులను అనర్హులుగా ప్రకటించారు. ఇద్దరిని అర్హులుగా ప్రకటించారు. ఇక్కడే అసలు కథ జరిగింది. అనర్హులుగా ప్రకటించబడిన టెండరుదారుల్లో ఒకరు దేవదాయశాఖ కమిషనరు సత్యనారాయణకు ఫిర్యాదు చేశారు. తాను అన్ని డాక్యుమెంట్లు సమర్పించినప్పటికీ తనను అనర్హునిగా ప్రకటించారని... దీనిపై విచారణ చేయాలని సదరు టెండరుదారుడు విజ్ఞప్తి చేశాడు. సదరు టెండరుదారుని ఫిర్యాదు మేరకు విచారణ చేయించగా... ఆలయ ఎస్టాబ్లిష్ మెంటు విభాగంలో పనిచేసే ఏఈవో మల్లిఖార్జున ప్రసాద్, సూపరింటెండెంటు రవి, గుమస్తా రాజశేఖర్ హస్తం ఇందులో ఉన్నట్లు తేలింది. అధికార పార్టీకి చెందిన ఓ నేత వీరిపై ఒత్తిడి తెచ్చి అర్హులుగా ఉన్న టెండరు దారుని అనర్హునిగా ప్రకటించేశారు. అలా చేయకుంటే శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డికి చెప్పాల్సి వస్తుందని ఆయన బెదిరించారు. అధికార పార్టీకి చెందిన టెండరు దారుడు ఇలా బెదిరించడంతో ఈ ముగ్గురు ఉద్యోగులు భయపడ్డారు. ఆయన చెప్పినట్లు టెండరు దారులను అనర్హులుగా ప్రకటించారు. క్వాలిఫై బదులు డిస్ క్వాలిఫై రాసి కమిషనరుకు పంపారు. ఇలా చేయడంతో ఆ ముగ్గురు ఉద్యోగులు ఇరుక్కున్నారు. ఈ ఘటనపై దేవదాయశాఖ కమిషనరు సత్యనారాయణ విచారణకు ఆధేశించారు. ఆ విచారణలో ఉద్దేశ్య పూర్వకంగానే తప్పు వారు తప్పు చేసినట్లు తేలింది. దీంతో వారికి మొమోలు జారీ చేసి వివరణ కోరారు. పొరబాటున కంప్యూటర్లో ఇలా చేశామని ఆ ఉద్యోగులు వివరణ ఇచ్చారు. అయితే ఇందుకు దేవదాయశాఖ కమిషనరు సత్యనారాయణ సంతృప్తి చెందలేదు. తెలిసి తప్పు చేసిన మల్లిఖార్జున ప్రసాద్, రవి, రాజశేఖర్ పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ముక్కంటి ఆలయ ఈవో ఎన్ వీఎస్ఎన్ మూర్తిని ఆయన

2లో

అధికారులు బాధ్యతగా పనిచేయాలి

- నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయండి
- అధికారులకు కలెక్టర్ వెంకటేశ్వర్ సూచన

విశాలాంధ్ర-తిరుపతి సిటీ: జిల్లాలో సెప్టెంబర్ 17న చేపట్టే జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ వైద్య ఆరోగ్యశాఖ తదితర సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి శుక్రవారం వర్చువల్ విధానంలో నిర్వహించిన సమన్వయ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవడం, శౌచాలయానికి వెళ్లి వచ్చాక చేతులను శుభ్రంగా కడుక్కోవడం ద్వారా, పరిశుభ్రతను పాటించడం ద్వారా నులిపురుగుల బారిన పడకుండా నివారించవచ్చని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పిల్లలు, కిషోర బాలల కడుపులో నులి పురుగులు నిర్మూలించడానికి ఉచితంగా ఆల్బెండజోల్ 400 మిల్లీగ్రాముల చప్పరించే మాత్రలను 15 వ తేదీ నాటికి సంబంధిత విద్యా సంస్థలకు అందేలా సరఫరా చేయాలన్నారు. సంబంధిత ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్లు ఎన్‌డీడీ యాప్‌లో ఎంత మందులు కావాలో నమోదు చేయాలచి సూచించారు. జిల్లాలో మొత్తం 4,93,608 మంది విద్యార్థులు ఉండగా అందులో అంగన్వాడీ కేంద్రాల్లో 98405 మంది, ప్రభుత్వ, ప్రైవేట్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 3,15,915 మంది, ప్రభుత్వ, ప్రైవేట్ ఇంటర్ మీడియట్ కళాశాలల్లో 74,523 మంది, బడి బయట పిల్లలు (10-19సం) 4765 మంది ఉన్నారని అందరికీ ఆల్బెండజోల్ 400 మిల్లీగ్రాముల చప్పరించే మాత్రలను అందేలా చూడాలని డీఎంహెచ్ఓ పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఆల్బెండజోల్ మాత్రలను అన్ని మహిళా శిశు సంక్షేమ శాఖ అంగన్వాడీ కేంద్రాలకు, ప్రభుత్వ ప్రైవేట్ విద్యా సంస్థలు, కళాశాలలు, సంక్షేమ హాస్టళ్లు తదితర విద్యా సంస్థలకు ఉచితంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తద్వారా నులిపురుగుల సంక్రమణను సులభంగా నిర్మూలించ వచ్చునని పేర్కొన్నారు. 1-2 సం పిల్లలకు సగం మాత్ర (200 ఎంజీ), 2-19 సం పిల్లలకు ఒక మాత్ర (400 ఎంజీ) చప్పరిస్తూ మింగించాలని తెలిపారు. నులిపురుగులు ఉన్న

2లో

బాధ్యతగా పనిచేయాలి

పిల్లలు పోషకాహార లోపం, రక్తహీనత వల్ల నీరసంగా ఉంటారని, శారీరక మానసిక ఎదుగుదల లోపాలను కలిగి ఉంటారని అలాంటి వారందరికీ ఆల్బెండజోల్ చప్పరించే మాత్రలను తప్పనిసరిగా వేయించాలన్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్య అధికారులు, మండల పరిధిలో మండల విద్యా శాఖాధికారులు, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు పర్యవేక్షించాలని, సంబంధిత శాఖల జిల్లా అధికారులు ఈ కార్యక్రమం పకడ్బందీగా జరిగేలా చూడాలని తెలిపారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం రోజున ఏదేని కారణం చేత డీ వార్మింగ్ వేయబడని పిల్లలకు మరలా సెప్టెంబర్ 25న మాప్ అప్ రోజున ఆల్బెండజోల్ మాత్రను చప్పరించి మింగేలా చర్యలు తీసుకోవాలని వైద్యశాఖ అధికారులతో కలెక్టర్ పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఎంహెచ్వో శ్రీహరి, రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం ప్రాజెక్ట్ అధికారిని పద్మావతి, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిని జయలక్ష్మి, డీఈఓ శేఖర్, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి చెన్నయ్య తదితర అధికారులు పాల్గొన్నారు.

ముక్కంటి ఆలయ అధికారులా... మజాకా

ఆదేశించారు. అయితే ఏ కారణంగానో ఈ ముగ్గురిపై ఈవో ఎన్ వీఎస్ఎన్ మూర్తి చర్యలు తీసుకోలేదు. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా ఈ ముగ్గురు ఉద్యోగులు తప్పు చేయాల్సి వచ్చింది. ఒత్తిడి తెచ్చిన నాయకుడేమో దర్జాగా తిరుగుతున్నాడు. ఒత్తిడికి లొగ్గి తప్పు చేసిన ఉద్యోగులు ఇపుడు మానసిక క్షోభ అనుభవిస్తున్నారు. వీరిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సిందేనని కమిషనరు చెబుతున్నప్పటికీ... ఈవో ఎన్ వీఎస్ఎన్ మూర్తి మాత్రం ఎందుకో మీన మేషాలు లెక్కిస్తున్నారు. ఈ సంఘటన ముక్కంటి ఆలయంలో చర్చనీయాంశంగా మారింది. వీరిని ఇలాగే వదిలేస్తే ఆలయంలో మరిన్ని తప్పులు జరిగే అవకాశం ఉంది. ఉన్నతాధికారులు ఏ చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

12 ఏళ్ల బాలిక అదృశ్యం

విశాలాంధ్ర-సూళ్లూరుపేట: తిరుపతి జిల్లా సూళ్లూరుపేట పట్టణములోని గాంధ్ల వీధిలో నివాసముంటున్న షేక్ వజీహ, అజ్జుముద్దీన్ కుమార్తె షేక్ ఆఫ్రిన్ పట్టణములోని ప్రముఖ ప్రైవేట్ విద్యా సంస్థలో 6వ తరగతి చదువుతున్న 12 ఏళ్ల బాలిక షేక్ ఆఫ్రిన్ అదృశ్యం అయింది. శుక్రవారం తెల్లవారుజామున ట్యూషన్ కి తన బాబాయ్ తో వెళ్లి బాలిక ట్యూషన్ నుంచి తిరిగి ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురై స్కూల్ వద్దకు చేరుకొని బాలిక ఆచూకీ కోసం పట్టణంలోని తమ బంధువు మిత్రుల కలిసి కుటుంబ సభ్యులు బాలిక ఆచూకీ పై పట్టణ పరిసరాలను గాలింపు చేపట్టారు. ఎక్కడ తల్లిదండ్రులకు బాలిక ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సూళ్లూరుపేట సీఐ, ఎస్సై బ్రహ్మనాయుడు రంగ ప్రవేశం చేసి బాలిక ఆచూకీ కోసం విస్తృతంగా గాలింపు చర్యలు చేపడుతున్నారు ఎవరికైనా బాలిక ఆచూకీ తెలిసిన యెడల సూళ్లూరుపేట పోలీసులకు 9440796360,9440796361 ఫోన్ నెంబర్లకు సమాచారం అందించాల్సిందిగా సూళ్లూరుపేట పోలీసులు కోరుతున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

విశాలాంధ్ర-రేణిగుంట: రేణిగుంట మండల పరిధిలో గల తూకివాకం, కరకంబాడి, ఎల్లమండ్యం, గాజుల మండ్యం, కుర్ర కాలువ సబ్ స్టేషన్ పరిధిలో ఉన్నటువంటి విద్యుత్తు లైన్ల మరమత్తులు, విద్యుత్ లైన్లపై ఉన్నటువంటి కొమ్మలను తొలగించుటకు శనివారం ఉదయం 8:00 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ అధికారులు పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు. విద్యుత్ వినియోగదారులు సరఫరా అంతరాయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

ఓజిలిలో నేడు విద్యుత్ అంతరాయం

విశాలాంధ్ర -ఓజిలి: మండలంలోని ఓజిలి ఆర్మీను పాడు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాలకు 14వ తేదీ శనివారం విద్యుత్తును నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చేది వర్షాకాలం కావడంతో విద్యుత్ లైన్లు కింద ఉన్న చెట్లు వల్ల ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్తగా చెట్లను తొలగించడం జరుగుతుందని ఆయన తెలియజేశారు. అందువలన 9గంటల నుండి 12 గంటల వరకు విద్యుత్తును నిలిపివేస్తున్నామన్నారు.

జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదం దురదృష్టకరం

గాయపడిన వారికి ప్రత్యేక వైద్య సేవలు - జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర-చిత్తూరు, పలమనేరు: చిత్తూరు జిల్లా బంగారుపాలెం మండలం మొగిలి ఘాట్ రోడ్ లో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదం దురదృష్టకరమని చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. ఘోర రోడ్డు ప్రమాద ఘటనలో గాయపడ్డ వారి ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. సంఘటన వెంటనే హుటాహుటిన సంఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యలు చేపట్టామని తెలిపారు. గాయపడ్డ ప్రయాణికులను చిత్తూరు జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్య సేవలు అందిస్తున్నట్లు వివరించారు. గాయపడ్డ వారిని జిల్లా కలెక్టర్, ఎస్పి మణికంఠ చందోలు, జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యా ధరి పరామర్శించారు. ఈ ఘటనలో గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికాలను కలెక్టర్ ఆదేశించారు.

సీతారాం ఏచూరికి అశ్రునివాళి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి శ్రీకాళహస్తి పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య భవన్ లో ఆ పార్టీ నేతలు శుక్రవారం ఘనంగా అశ్రు నివాళి అర్పించారు. సీతారాం ఏచూరి గొప్ప మేధావి అని... ఆయన మరణం కమ్యూనిస్టు ఉద్యమాలకు తీరని లోటని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య, రిటైర్డ్ ప్రొఫెసర్ ఎస్ఎం షరీఫ్ అన్నారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా లౌకిక శక్తులను కూడగట్టి ఒక్కతాటిపైకి తేవడంలో ఏచూరి అవిశ్రాంతంగా పోరాడారని గుర్తు చేశారు. మార్క్సిజం, లెనినిజాలు పిడివాదం కాదని... నిర్దిష్ట పరిస్థితులకు అన్వయించుకుంటే ప్రజా సమస్యలకు పరిష్కారాలు దొరుకుతాయంటూ గట్టిగా వాదించిన కమ్యూనిస్టు యోధుడు ఏచూరి అని కొనియాడారు. ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడి జైలుకెళ్ళిన ధీరుడు ఏచూరి అని గుర్తు చేశారు. పేదలకు చేతినిండా పని, మూడుపూటలా తిండి పెడుతున్న ఉపాధి హామీ పథకం చట్ట రూపం దాల్చడానికి ఏచూరి చేసిన కృషి వెలకట్టలేనిదన్నారు. ఏచూరి వారసులుగా నేటితరం కమ్యూనిస్టులు ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గంధం మణి, రెడ్డిపల్లి సురేష్, కుమార్, అన్వర్ బాషా, ఉస్మాన్ బాషా, రాజా, వెలివేంద్రం, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

భారీగా ఎర్రచందనం దుంగలు స్వాధీనం

విశాలాంధ్ర-తిరుపతి సిటీ: ఎర్రచందనం అక్రమ రవాణా పై తిరుపతి టాస్క్ ఫోర్స్ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. శుక్రవారం రూ.62.5 లక్షల విలువ చేసే ఎర్రచందనం దుంగలు, మినీ లారీని స్వాధీనం చేసుకున్నారు. కడప రిజర్వ్ ఇన్స్పెక్టర్ చిరంజీవులు, రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్ నరేష్ సిబ్బందిని గురువారం నంద్యాల జిల్లా చాబోలు మార్గంలో తనిఖీలు చేపట్టారు. కర్నూలు నుంచి కడప వైపు వెళ్తున్న ఒక మినీ లారీని తనిఖీ చేయగా 54 ఎర్రచందనం దుంగలు పట్టుబడ్డాయి. వాహనంలో వస్తున్న నలుగురు వ్యక్తులు పారిపోవడానికి ప్రయత్నించగా టాస్క్‌ఫోర్స్ సిబ్బంది వారిని వెంబడించి పట్టుకున్నారు. ప్యాకర్స్ మూవర్స్ వాహనంలో ఇంటి పరికరాలు, బాక్సులు తరలింపు మాటున ఎర్ర చందనం తరలిస్తున్నట్లు గుర్తించారు. దీనిపై సబ్ ఇన్స్పెక్టర్ రఫీ కేసు దర్యాప్తు ప్రారంభించారు. పట్టుబడిన నిందితుల్లో ఒకరు రాజస్థాన్‌కు చెందిన వ్యక్తి, మరొకరు హైదరాబాద్‌కు చెందిన వారు. మరో ఇద్దరు ప్రకాశం జిల్లాకు చెందిన వారిగా గుర్తించారు. స్మగ్లర్లను అరెస్ట్ చేయడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

మరోసారి తిరుపతిలో ఆటో డ్రైవర్ బాలాజీ నిజాయితీ

విశాలాంధ్ర-రేణిగుంట రేణిగుంట రోడ్డులో గల అంబేద్కర్ లా కాలేజీ వద్ద నుండి తమిళనాడు నివాసి అయిన మణికంఠను కోర్ట్ వద్దకు బడుగులు మాట్లాడుకుని డ్రాప్ చేసి వెళ్లాడు. అయితే మణికంఠ ఆటోలో బ్యాగ్‌ను మరిచి వెళ్లడం జరిగింది చాలా దూరం ప్రయాణం చేసిన తర్వాత ఆటోడ్రైవర్ బాలాజీ బ్యాగ్ ను గమనించి మరలా కోర్ట్ వరకు వచ్చి మణికంఠను వెతకడం జరిగింది అయితే మణికంఠ దొరకకపోవడంతో బ్యాగును తెరిచి చూడగా మణికంఠ ఆధార్ కార్డు ఉన్నది ఆ కార్డు లో మణికంఠ ఫోన్ నెంబర్ లేదు మరో ఆధార్ కార్డు వాళ్ల తండ్రిగారిది ఉన్నది వారి తండ్రి నెంబర్ కు ఫోన్ చేసి వారి అబ్బాయి ఫోన్ నెంబర్ తెలుసుకొని అతనికి ఫోన్ చేసి ఆటో యూనియన్ నాయకుల సహకారంతో కోర్టు వద్దకు వెళ్లి ఆ బ్యాగును మణికంఠకు ఆటో యూనియన్ నాయకులు పోలీసుల సమక్షంలో అతనికి బ్యాగును అప్పజెప్పడం జరిగిందిఈ కార్యక్రమంలో శ్రీ బొంతాలమ్మ ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు. దుర్గా పతి.పట్టాభి మురళి బాలాజీలు పాల్గొన్నారు.

గాయపడ్డ మురళిని పరామర్శించిన ఎమ్మెల్యే నాని

విశాలాంధ్ర-యర్రావారిపాళ్యం: మండలంలోని చింతగుంట గ్రామం, పసుపులేటి వారిపల్లి గ్రామానికి చెందిన జనసేన మండల పార్టీ అధ్యక్షులు మురళి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న మురళిని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఇంటికి వెళ్లి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని యధావిధిగా పార్టీలో చురుకుగా పాల్గొనాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వం మండల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-పిచ్చాటూరు: అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని అంగన్ వాడి సూపర్వైజర్ మారెమ్మ తెలిపారు. శుక్రవారం మండలంలోని కొత్త గొల్ల కండ్రిగ అంగన్వాడి కేంద్రంలో అంగన్వాడీల ఆధ్వర్యంలో పౌష్టికాహారం మాసోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్తలు ఆయాలు ఏర్పాటుచేసిన పౌష్టికాహార స్టాల్స్ ను వైద్యాధికారులు, అంగన్వాడి అధికారులు తిలకించారు. ఆకుకూరలు కూరగాయలతో ఏర్పాటుచేసిన సమగ్ర శిశు సంక్షేమ చిహ్నా నం విశేషంగా ఆకర్షించింది. అనంతరం సూపర్వైజర్ మారెమ్మ మాట్లాడుతూ గర్భవతులు బాలింతలు తల్లులు చిన్నారులు ప్రతిరోజు పౌష్టికాహారం తీసుకోవడంతో రక్తహీనత దరిచేరదన్నారు. ఆకుకూరలు, గుడ్లు, పండ్లు పాలు తప్పకుండా తీసుకోవాలన్నారు. అంగన్ వాడి కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాల న్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది నలినాక్షి, హిమశ్రీ, అంగన్వాడి కార్యకర్తలు, వెంకటసుబ్బమ్మ, గోవిందమ్మ, హిమ బిందు, ఆశ వర్కర్లు, ఆయాలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

యంత్రాలతో ఉపాధి పనులు

విశాలాంధ్ర-బాలాయపల్లి: మండలంలోని సుబ్రమణ్యం గ్రామంలో ఉపాధి కూలీలతో చేపట్టాల్సిన ఉపాధి పనులను శుక్రవారం ఉపాధి అధికారులు సాక్షిగా యంత్రాలతో చేపట్టారు. దీంతో గ్రామంలోని ఉపాధి కూలీలు ద్వామా పీడీ శ్రీనివాస్ ప్రసాద్‌కు చరవాణి ద్వారా ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన ఏపీడీ వరప్రసాద్ రావును పంపించి పరిశీలన చేశారు. అయితే యంత్రాలతో చేపడుతున్న పంట కాలువ పనులు యధావిధిగా కొనసాగాయి. దీనిపై ఏపీడీ వరప్రసాద్ రావు గ్రామంలో విచారించగా కొత్తగా నియమించిన యాక్టివ్ మేట్ కను సన్నల్లో పనులు జరుగుతున్నాయని ఉపాధి కూలీలు పేర్కొన్నారు. యంత్రాలతో చేపడుతున్న ఉపాధి పనులకు బిల్లులు పెట్టొద్దు అంటూ ఏపిడి వరప్రసాదరావు మండలంలోని ఉపాధి అధికారులను ఆదేశించారు. గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకులు మా బిల్లు ఆపేవాడు ఎవడు అంటూ గ్రామంలోని విర్రవీగుతుండటంతో ఉపాధి కూలీలు తమకు పనులు లేకుండా చేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశా రు. ఉన్నత అధికారులు స్పందించి యంత్రాలతో చేపడుతున్న పనులను అడ్డుకొని తమకు పనులు కల్పించాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో మృత్యుంజయ రావు టిఏ శ్రీను తదితరులు ఉన్నారు.

బోడే వెంకటేశ్వర రెడ్డికి ఎమ్మెల్యే పరామర్శ

విశాలాంధ్ర-యర్రావారిపాళ్యం: మండలంలోని బోడెవాండ్ల పల్లి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు బోడే వెంకటేశ్వర రెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని కూటమి మండల నాయకులతో కలిసి వెంకటేశ్వర రెడ్డిని ఇంటికి వెళ్లి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

అక్రమ గేట్ వసూళ్లపై పోరాడుదాం

ఏఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాధాకృష్ణ

విశాలాంధ్ర-తిరుపతి: ఏఐటీయూసీ కార్యాలయం నందు శుక్రవారం ఉదయం 11 గంటలకు వీధి వ్యాపారుల ముఖ్యుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాధాకృష్ణ, వీధి వ్యాపారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి. హెచ్. శివకుమార్ పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ తిరుపతి కార్పొరేషన్ పరిధిలో 5 వేల మందికి పైగా వీధి విక్రయ దారులు చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని అన్నారు. వీరందరినీ కార్పొరేషన్ అధికారులు గుర్తించి గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. నగరంలో అక్రమంగా వీధి వ్యాపారుల నుండి అక్రమ గేట్ వసూళ్లు చేస్తున్న దందాపై పోలీస్ అధికారులు, అదేవిధంగా కార్పొరేషన్ అధికారులు వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. రెక్కాడితే గాని డొక్కాడని పేద వ్యాపారుల నుండి ప్రతిరోజు ప్రతి వ్యాపారి దగ్గర గేట్ రూ.50 నుండి రూ.100 వసూలు చేస్తున్నప్పటికీ ఏ ఒక్క అధికారి కూడా ఈ విషయంపై స్పందించక పోవడానికి గల కారణాలేంటని ఏఐటియుసిగా ప్రశ్నిస్తున్నాం అని అన్నారు. వీరి వల్ల ఎవరు లబ్ధి పొందుతున్నారు అని కూడా అన్నారు. వీటిపై అధికారులు స్పందించకపోతే రానున్న రోజుల్లో నగరంలో ఉన్న వీధి వ్యాపారులందరినీ కలుపుకొని కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరిక జారీ చేశారు. ఈ సమావేశంలో ఏఐటియుసి నగర ప్రధాన కార్యదర్శి ఎన్‌డి రవి, జిల్లా ఉపాధ్యక్షులు వైయస్ మణి, వీధి వ్యాపారుల సంఘం నగర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసులు, భాష, బుజమ్మ, పెంచలమ్మ, కాంచనమ్మ, వాసు, గురవయ్య, శేఖర్, గీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోవడానికి జిల్లా వ్యాప్తంగా దాతలు

విశాలాంధ్ర-తిరుపతి సిటీ: రాష్ట్రంలో ఇటీవల సంభవించిన అధిక వర్షాల కారణంగా నష్టపోయిన వరద బాధితులను ఆదుకోవడానికి దాతలు ముందుకు వస్తున్నారు. వరద బాధితులను ఆదుకోవడానికి జిల్లా వ్యాప్తంగా దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కలెక్టర్ వెంకటేశ్వర్‌కు విరాళాలు అందజేస్తున్నారు. శుక్రవారం తిరుపతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది తమ వంతు సహాయంగా కలెక్టర్ వెంకటేశ్వర్‌కు రూ.27 వేలు అందించారు. అలాగే తిరుపతి జిల్లా విద్యా శాఖ తరపున లక్ష రూపాయలు, రేణిగుంట తపస్య ఇంగ్లీష్ మీడియం పాఠశాల నిర్వాహకులు రూ.40 వేలు విరాళం అందజేశారు.

వృద్ధులకు అన్నదానం

విశాలాంధ్ర-కార్వేటి నగరం: మండల పరిధిలోని డిఎం పురం గ్రామానికి చెందిన యువన్ సాయి 11వ పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం తల్లి లోకేశ్వరి తండ్రి భీమారావు ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. అనంతరం చిన్నారికి వృద్ధులు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వర్, పర్యవేక్షకులు ప్రకాష్, వృద్ధులు పాల్గొన్నారు.

ముక్కంటికి రూ.1.15 లక్షల వెండి గిన్నెల వితరణ

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాల సందర్భంగా ఉత్సవాలకు వాడుకునేందుకు రూ.1.15 లక్షల విలువ చేసే వెండి గిన్నెలను శ్రీకాళహస్తికి చెందిన మదన్మోహన్ నాయుడు అనే భక్తుడు కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం విరాళంగా అందజేశారు. ఆలయ అధికారులు, వేదపండితులు ఈ విరాళం స్వీకరించారు. దాతకు కృతజ్ఞతలు తెలియచేసి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. అదేవిధంగా స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

బోయకొండ గంగమ్మకు రాహుకాల అభిషేకం

విశాలాంధ్ర-చౌడేపల్లి: శక్తి స్వరూపిణి బోయకొండ గంగమ్మకు శుక్రవారం లోక సుభిక్షం కోరుతూ రాహుకాల అభిషేకాన్ని సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు రాహుకాల అభిషేకానికి భక్తుల నుంచి విశేష స్పందన లభించింది ఉదయాన్నే ప్రధాన అర్చకులు వేద పండితుల ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష అభిషేకము అలంకరణ గావించారు అనంతరం రాహుకాల సమయంలో రాహుకాల అభిషేకాన్ని నిర్వహించారు పాత కళ్యాణ కట్ట వద్ద భక్తులకు శుక్రవారం ఉచిత అన్న ప్రసాద శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అన్నదాన కార్యక్రమానికి పలమనేరుకు చెందిన నవీన్ ఉచిత అన్న ప్రసాదానికి కూరగాయలు విరాళంగా అందించారు ఆలయ ఇఓ మరియు ఉప కార్యనిర్వాహణాధికారి ఏకాంబరం అర్చక అధికార సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులకు డిఆర్‌డబ్ల్యు కళాశాల చేయూత

విశాలాంధ్ర-గూడూరు: విజయవాడ నగరంలో వరద బాధితులను ఆదుకొంటూ నిర్వహించే సేవా కార్యక్రమాల్లో తనతోపాటు గూడూరు నియోజకవర్గానికి చెందిన 34 మంది టిడిపి నాయకులు ఆరు రోజులపాటు విజయవాడ నగరంలో పనిచేయడం జరిగిందని గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ తెలిపారు. గూడూరు పట్టణంలోని దువ్వూరు రమణమ్మ మహిళా కళాశాలలో విజయవాడ నగరం వరద బాధితులకు డిఆర్‌డబ్ల్యు కళాశాల యాజమాన్యం లక్ష రూపాయలు ఆర్థిక సహాయాన్ని గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్‌కు అందజేశారు. దువ్వూరు రమణమ్మ మహిళా కళాశాల విద్యార్థినిలు విజయవాడ నగర వరద బాధితులకు సేకరించిన దుస్తులను తీసుకువెళు తున్న వాహనాన్ని గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు దాతలు స్వచ్ఛంద సంస్థలు స్పందించి ఇప్పటివరకు సుమారు 46 లక్షల రూపాయలు విరాళాలు అందజేయడం జరిగిందని ఇంకా కూడా దాతలు విరాళాలు అందజేసేందుకు సముఖంగా ఉన్నారని తెలిపారు. ఈ క్రమంలో డిఆర్‌డబ్ల్యు కళాశాల యాజమాన్యం లక్ష రూపాయల విరాళం ఇవ్వడం అభినందనీయమని పేర్కొన్నారు. వరద బాధితులకు దుస్తులు అందజేసేందుకు విద్యార్థినీలు ప్రధానంగా ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు తీసుకున్న చొరవ అభినందనీయమన్నారు. విజయవాడ నగరంలో వరదలు వచ్చిన ప్రాంతాలను చూస్తే కడుపు తరుక్కుపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడ నగరంలో వేలాది కుటుంబాలు కట్టుబట్టలతో మిగిలిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వారిని ఆదుకునేందుకు మానవత్వంతో ప్రజలు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. ఆపదలో ఉన్న ప్రజలను ఆదుకునేందుకు గూడూరు నియోజకవర్గం లోని దాతలు ముందుకు వస్తారని నిరూపించగలిగారని అన్నారు.

ఘనంగా ప్రారంభమైన పవిత్రోత్సవాలు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం పవిత్రోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రతి ఏడాది భాద్రపద మాసంలో పవిత్రోత్సవాలను నిర్వహించడం ఆనవయితీగా వస్తోంది. ప్రారంభం సందర్భంగా భరద్వాజ మహర్షి విగ్రహానికి దక్షిణామూర్తి సన్నిధిలో ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. భరద్వాజ మహర్షి గోత్రీకులు స్వామి అమ్మవార్లకు అభిషేకాలను నిర్వహిస్తుంటారు. అందువలన ఉత్సవాల ప్రారంభం సందర్భంగా మహర్షి విగ్రహానికి అభిషేకాలు నిర్వహించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. దీంతో పవిత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి, ఆయన సతీమణి రిషితారెడ్డి, తల్లి బృందమ్మ అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఈవో ఎస్‌వీఎస్‌ఎన్ మూర్తి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు రంగినేని చెంచయ్య నాయుడు, మాజీ కౌన్సిలర్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈనెల 17వ తేదీ వరకు ఉత్సవాలు జరగనున్నాయి. పౌర్ణమి సందర్భంగా 17వ తేదీన స్వామి అమ్మవార్ల ఊరేగింపు జరగనుంది. ఏడాది పాటు ఆలయంలో జరిగిన పూజలు, అభిషేకాలు, కార్యక్రమాల్లో లోటుపాట్లు ఉంటే వాటి పరిహారం కోసం పవిత్రోత్సవాలను నిర్వహిస్తుంటారు.

15వ వార్షిక సర్వసభ్య సమావేశం

తిరుపతి చాంబర్ ఆఫ్ కామర్స్ పిలుపు

విశాలాంధ్ర-తిరుపతి: స్థానిక రామ్ తులసి కళ్యాణ మండపం నందు ఈనెల 15వ తేదీ ఆదివారం ఉదయం తొమ్మిదిన్నర గంటలకు తిరుపతి చాంబర్ ఆఫ్ కామర్స్ వార్షిక సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు.. అధ్యక్షులు మోహన్ కుమార్ రాజు పిలుపునిచ్చారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం మీడియా ముందు కమిటీ కార్యదర్శి వాసుదేవన్ బై అండ్ సేవ్ మధు, మలిశెట్టి రవి, కోదండ రామయ్య, చక్రపాణి తదితరులతో కలిసి మోహన్ కుమార్ మాట్లాడుతూ.. చాంబర్ ఆఫ్ కామర్స్‌కు 36 అసోసియేట్స్ యూనియన్‌లు పనిచేస్తున్నాయన్నారు. కావున తిరుపతిలోని వివిధ వ్యాపార వర్గ సంఘ ప్రతినిధులు మరియు సభ్యులు హాజరై ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తిరుపతి శాసన సభ్యులు ఆరని శ్రీనివాసులు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, తిరుపతి ఎంపీ గురుమూర్తి, తిరుపతి కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, బిజెపి నేత భాను ప్రకాష్ రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు తది తరులు విశిష్ట అతిథులుగా విచ్చేయుచున్నారని వివరించారు.

ప్రతి ఒక్కరూ డ్రైవింగ్‌పై అవగాహన కల్గి ఉండాలి

గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్

విశాలాంధ్ర-గూడూరు: చదువుకున్న యువకులు సామాజిక బాధ్యతతో కూడిన వ్యాపారాలు ఎంచుకోవడం అభినందనీయమని గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ అన్నారు. గూడూరు రెండో పట్టణ పరిధిలోని నరసింగరావుపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన జూహి మోటార్ డ్రైవింగ్ స్కూల్‌ను గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ ప్రారంభించారు. డ్రైవింగ్ స్కూల్ నందు ఉన్న సదుపాయాలు ఈ డ్రైవింగ్ స్కూల్లో శిక్షణ పొందే వారికి అందిస్తున్న సేవలను స్కూల్ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ చదువుకున్న యువత వారి సొంతంగా చిన్న చిన్న వ్యాపారాలు ప్రారంభించి వారు నిలబడటంతోపాటు నలుగురికి ఉపాధి అవకాశం కల్పించడం అభినందనీయమన్నారు. త్వరలో గూడూరు పట్టణంలో జాబ్ మేళా నిర్వహిస్తామని అర్హత కలిగిన యువతకు వివిధ కంపెనీలలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మానవుని నిత్యజీవితంలో డ్రైవింగ్ ఒక భాగంగా మారిందని ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ పై అవగాహన కలిగి ఉండాలని ఇలాంటి స్కూల్‌ల ద్వారా డ్రైవింగ్ నేర్చుకోవడంతోపాటు డ్రైవింగ్ పై పూర్తి అవగాహన కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీవో కిషోర్, తెలుగుదేశం పార్టీ నాయకులు రహీం, చెంచురామయ్య, రత్నం, డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకుడు చైతన్య తదితరులు పాల్గొన్నారు.

పురోహితులు, రిటైర్డ్ హెచ్ఎం వెంకటరమణకు పలువురు నివాళి

విశాలాంధ్ర-కార్వేటినగరం: బ్రహ్మశ్రీ వేదమూర్తులు మండల పరిధిలోని ఆర్కే వీబి పేట గ్రామ పురోహితులు మారుపెద్ది వెంకటరమణ 62 శుక్రవారం ఉదయం అకాల మరణం పట్ల జీడి నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం థామస్ ఫోన్ ద్వారా వెంకటరమణ కుటుంబ సభ్యులను ఓదార్చి సానుభూతి తెలియజేసి, ఆ కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు. జిల్లా రైతు సంఘం అధ్యక్షులు, మండల టిడిపి పార్టీ అధ్యక్షులు నాగేశ్వర రాజు, చంగల్రా యయాదవ్,టిడిపి నాయకులు చంద్ర మౌళి రెడ్డి, నాగభూషణ్ రెడ్డి, హేమాద్రి, రాము, రవి రాజు, అన్నా రెడ్డి, రమేష్ రెడ్డిలు వెంకటరమణ మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలోనూ, పురోహితు ప్రతిలోనూ అంకితభావంతో పనిచేశారని పేర్కొన్నారు. సిడి కండిగ టిడిపి నాయకులుదాసరి గణేష్, శ్రీనివాస్ యాదవ్, నరేష్, నడిపి రెడ్డి, కుప్పారెడ్డి తదితరులు పూలమాలవేసి నివాళులర్పించారు. అదేవిధంగా కార్వేటి నగర్ మండలం, పుత్తూరు శ్రీరంగరాజ పురం వెదురు కుప్పం మండలాల నుంచి ఉపాధ్యాయులు విశ్రాంతి ఉపాధ్యాయులు వెంకటరమణ మృతదేహానికి పూల మాలవేసి నివాళులర్పించారు. ఆర్కేవిబి పేట గ్రామం శోకసముద్రంలో మునిగిపోయింది.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



విశాలాంధ్ర-తడ: మండల పరిధిలోని తడ శ్రీసిటీ జీరో పాయింట్ వద్ద జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కమిల్ మాలిక్ (25) మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. తడ ఎస్సై కొండప్ప నాయుడు సమాచారం మేరకు ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం ఘజియాబాద్ కు చెందిన కమిల్ మాలిక్ అనే యువకుడు గత కొంతకాలంగా శ్రీ సిటీలోని పరిశ్రమలలో స్క్రాబ్ ను సేకరించి వ్యాపారం చేస్తున్నాడని, తడలోని ఓ హోటల్లో అద్దెకు ఉంటూ స్క్రాబ్ వ్యాపార పని నిమిత్తం మోటర్ సైకిల్ పై చెన్నైకి వెళ్లి తిరిగి వస్తుండగా శ్రీ సిటీ జీరో పాయింట్ వద్ద మోటార్ సైకిల్ అదుపుతప్పి డివైడర్ను ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయని దీంతో స్థానికులు ఆ యువకుడుని సమీపంలోని శ్రీ సిటీ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్లో చెన్నైకి తరలిస్తుండగా రామాపురం వద్ద ఆ యువకుడు మృతి చెందాడని ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నాయుడు క్వార్టర్స్ వినాయక స్వామి నిమజ్జనం

విశాలాంధ్ర-చౌడేపల్లి: చౌడేపల్లి పట్టణంలోని నాయుడు క్వార్టర్స్ సముదాయంలో గల వినాయక స్వామి విగ్రహ నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు వినాయక చవితి నుంచి ఏడు రోజులపాటు పూజలు అందుకున్న వినాయక స్వామికి ఉదయాన్నే విశేష పూజలు నిర్వహించారు అన్నదాన కార్యక్రమం అనంతరం స్వామి వారి చేతిలో గల లడ్డు ప్రసాదానికి వేలంపాట నిర్వహించారు యువత సభ్యులు రూ. 15,116లు అదేవిధంగా టెంకాయను రూ 3,116లు స్వామివారి చేతిలో ఉన్న ఐదు రూపాయల కాయిన్ ను రూ.7,116లను హెచ్చుగా పాడి దక్కించుకున్నారు తర్వాత బాణాసంచాలు బళ్లారి డ్రమ్ములు మహిళల కోలాటాలతో కోలాహలంగా నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు ముఖ్యంగా మహిళల వేయబడ్డ కోలాట కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది అనేక కార్యక్రమాల మధ్య సాంప్రదాయపద్ధంగా పట్టణంలో ఊరేగించి తర్వాత సమీపంలోని చెరువులో నిమజ్జనం చేశారు.

సచివాలయాలను పంచాయతీల్లో విలీనం చేయాలి

విశాలాంధ్ర-తిరుపతి సిటీ: గ్రామ సచివాలయాలను గ్రామపంచాయతీలలో విలీనం చేసి సచివాలయ సెక్రటరీలు, పంచాయతీ సెక్రటరీలు గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో పనిచేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పంచాయతీ చాంబర్ రాష్ట్ర అధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ బాబు రాజేంద్రప్రసాద్ కోరారు. తిరుపతి ప్రెస్ క్లబ్లో ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్ర పంచాయతీరాజ్ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారని గ్రామ సర్పంచ్ల నిధులను సైతం జగన్మోహన్ రెడ్డి పక్కదారి పట్టించాలని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గ్రామపంచాయతీలకు తిరిగి జీవం పోస్తున్నారని కొనియాడారు. గ్రామ పంచాయతీ లకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన తొమ్మిది వేల కోట్లను ఒక్క రూపాయలను గ్రామాల అభివృద్ధి కి విడుదల చేసిన గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి పవన్ కళ్యాణ్కు కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్రంలో వలంటరీ వ్యవస్థను పూర్తిగా రద్దుచేసి గ్రామస్థాయిలో ఉన్న వార్డు సభ్యులను మండల స్థాయిలో ఎంపీటీసీలను మున్సిపాలిటీలలో కౌన్సిలర్లను ఉపయోగించుకోవాలని సూచించారు.

రవాణా శాఖ అధికారిగా మురళీమోహన్

విశాలాంధ్ర-తిరుపతి సిటీ: తిరుపతి జిల్లా రవాణా శాఖ అధికారిగా మురళీమోహన్ శుక్రవారం ఆర్టీవో కార్యాలయంలో బాధ్యత స్వీకరించారు. నెల్లూరు ఆర్టీవోగా పనిచేస్తున్న ఆయన బదిలీపై తిరుపతికి వచ్చారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తిరుపతి జిల్లాలో సుమారు 7 లక్షలకు పైగా వాహనాలు ఉన్నాయని అందులో సొంత వాహనాలు, ట్రాన్స్పోర్ట్ వాహనాలు ఉన్నాయని తెలిపారు. వాహనదారులు బాధ్యతగా వాహనాలను నడపాలని, తద్వారా ప్రమాదాలు అరికట్టవచ్చని చెప్పారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. రోడ్డు భద్రత కార్యక్రమాలు చేపట్టి ప్రజలలో అవగాహన కల్పిస్తామ న్నారు. ఆన్లైన్లో ఉన్న 86 రకాల ఆర్టీవో వాహన సేవలు ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. దళారులను నమ్మి మోసపోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎంవిఐ సుబ్రమణ్యం, కార్యాలయ సిబ్బంది డీటీఓని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నులిపురుగులు నివారణకు చర్యలు చేపడుదాం

ఎంపిడిఓ త్రివిక్రమ్ రావు

విశాలాంధ్ర-బుచ్చినాయుడు కండ్రిగ: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఇంచార్జి ఎంపీడీవో త్రివిక్రమ్ రావు ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రము నులిపురుగుల నివారణ కార్యక్రమం పై మండల అధికారుల సమావేశము నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య అధికారి దివాకర్. ఆరోగ్య అధికారి డిఎన్ వెంకటేశులు మాట్లాడుతూ సెప్టెంబర్ 17వ తేదీన జరిగే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ప్రతి ఏడాది రెండు పర్యాయాలు జరిగేటువంటి నులిపురుగుల నివారణ కార్యక్రమము ఫిబ్రవరి 9వ తారీఖున జరిగినది. రెండవ విడతగా సెప్టెంబర్ నెల 17వ తారీఖున జరగనున్నది. ఈ కార్యక్రమములో ఒక సంవత్సరము బిడ్డ నుండి 19 సంవత్సరముల పిల్లలందరికీ ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలలలోనూ అంగన్వాడీ లోను జూనియర్ కాలేజీలో మరియు స్కూల్ కి పోకుండా ఇంటి వద్దనే ఉన్న పిల్లలందరికీ ఖచ్చితముగా ఆల్బెండజోల్ టాబ్లెట్ 400 మిల్లీగ్రాములును మధ్యాహ్నం భోజనం తర్వాత ప్రతి ఒక్కరికి నమిలి మింగించాలని పిలుపునిచ్చారు, ఆశాలు అంగన్వాడి టీచర్లు పాఠశాల ఉపాధ్యాయ ప్రధానోపాధ్యాయులు, ఏఎన్ఎంలు ఎంఎల్హెచ్పిలు అందరూ పాల్గొని కార్యక్రమంను విజయవంతం చేయాలని తెలిపారు.

ఉచిత టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సులు ప్రారంభం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: రాష్ట్రీయ సేవాసమితి (రాస్) ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరత్నం ఆదేశానుసారం, రాస్ -జన శిక్షణా సంస్థాన్ ద్వారా మహిళలకు టైలరింగ్, బ్యూటీషియన్ ఉచిత శిక్షణా కార్యక్రమం శ్రీకాళహస్తి పట్టణం పానగల్ లో శుక్రవారం ప్రారంభించారు. రాస్ పొదుపు సంఘాల సంచాలకులు వి.నాగరాజు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీనియర్ మేనేజర్ హరికృష్ణ ఈ శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ... మహిళలు ఆర్థికంగా ఎదగాలంటే చేతివృత్తులు నేర్చుకోవాలన్నారు. నేటి ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా కుటుంబంలో ప్రతి ఒక్కరూ పని చేస్తూ ముందుకు సాగాలన్నారు. జన శిక్షణా సంస్థాన్ నిర్వహించే వివిధ రకాల చేతివృత్తులపై శిక్షణ తీసుకోవాలని కోరారు. అనంతరం యూనియన్ బ్యాంకు మేనేజర్ హరికృష్ణ మాట్లాడుతూ... ప్రస్తుత పరిస్థితులలో టైలరింగ్ కి, బ్యూటీషియన్ కోర్సులకు ఆదరణ చాలా ఎక్కువగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ నేర్చుకొని తమ కుటుంబాల ఆర్థికాభివృద్ధికి దోహదపడాలన్నారు. శిక్షణ పొంది వ్యాపారం చేయాలనుకునే వారికి తమ బ్యాంకు ద్వారా రుణ సదుపాయాన్ని తప్పక అందిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కాగా టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సులకు సంబంధించిన మెటీరియల్స్ మహిళలకు అందించారు. ఈ కార్యక్రమంలో రాస్ జన శిక్షణా సంస్థాన్ అధికారులు డాక్టర్ సుధాకర్ రెడ్డి, హరిబాబు, రాస్ ప్రాజెక్టు ఆఫీసర్ వెంకటేష్, సుబ్బారావు, వినోద్, ముఖేష్, షబ్బ, మీనా, జ్యోష్ణ జయలలిత, నాగలక్ష్మి క్లస్టర్ లీడర్లు, మహిళలు పాల్గొన్నారు.

వృధాగా పోతున్న నీరు

విశాలాంధ్ర-రేణిగుంట: గ్రామంలో ఎక్కడ నీరు వృధా అవుతున్న అరికట్టాల్సిన పంచాయతీ అధికారులు తమ కార్యాలయంలో తమ కళ్ళ ముందే రోజు నీళ్లు వృధా అవుతున్న తమకేమీ సంబంధం లేదు అనే రీతిలో వ్యవహరించడం విమర్శలకు తావిస్తుంది. సమస్యలు చెప్పుకునేందుకు పంచాయతీ కార్యాలయానికి వచ్చే జనాలే ఈ ఘటనను చూసి వీళ్ళ మన సమస్యలు పరిష్కరించేది అంటూ నవ్వుకుంటున్నారు. రేణిగుంట మేజర్ పంచాయతీ కార్యాలయం పదుల సంఖ్యలో అధికారులు, 100 మంది పైగా సిబ్బంది ఉంటున్న కార్యాలయం వద్ద ఉన్న వాటర్ ట్యాంక్ టాప్ లీకేజీ నీళ్లు వృధా అవుతున్న ఎవరు పట్టించుకునే పాపాన పోవడం లేదు. నిత్యం ఎంతోమంది సమస్యల పరిష్కారం కోసం పంచాయతీ కార్యాలయానికి వచ్చే ప్రజలు ఈ ఘటనను చూసి కార్యాలయంలో ఉన్న సమస్యను పరిష్కరించలేని వీళ్ళ ప్రజల సమస్యలు ఇక ఎప్పుడు పరిష్కరిస్తారో అంటూ హేళన చేస్తున్నారు. నిత్యం అధికారులు ప్రజాప్రతినిధులు వచ్చే పంచాయతీ కార్యాలయం ముఖద్వారం పక్కనే ఉన్న వాటర్ ట్యాంక్ లీకేజీని ఎవరు పట్టించుకోకపోవడం లేదని తీవ్ర విమర్శలకు దారితీస్తుంది. నీటి నీ వృధా చేయొద్దండి అంటూ ప్రజలకు చెప్పే వీళ్లే ఈ విధంగా నీరు వృధా అవుతున్న పట్టించుకోకపోవడం దారుణమని పంచాయతీ కార్యాలయం వద్దకు వచ్చే స్థానికులు అంటున్నారు. ఇకనైనా కొళాయిని మరమ్మత్తులు చేసి నీరు వృధా కాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

రాజగోపాలపురం ఫీడర్లో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

విశాలాంధ్ర-సత్యవేడు: చిన్నపాండూరు సబ్ స్టేషన్ రాజగోపాలపురం ఫీడర్లో సెప్టెంబర్ 14వ తేదీ శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు చెరివి విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ జగదీష్ పేర్కొన్నారు. ఈ ఫీడర్కు సంబంధించి రాజగోపాలపురం, రేపల్లెవాడ, సమర్థ కండ్రిగ, పివిపురం, ఒబుల్ రాజు కండ్రిగ, ఆనందపురం ఎస్టీ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండద న్నారు. ఫీడర్ మరమ్మతు, విద్యుత్ స్తంభాల వద్ద చెట్లు తొలగింపు వంటి పనుల కోసం విద్యుత్ సరఫరాను నిలిపిస్తున్నా మన్నారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన వివరించారు. విద్యుత్ వినియోగదారులు దీన్ని గమనించాలన్నారు. మధ్యాహ్నం రెండు గంటల తర్వాత యధావిధిగా విద్యుత్తు సరఫరా పునరుద్ధరిస్తామన్నారు.

స్కూల్ కాంప్లెక్స్ వారీగా స్కూల్స్ మ్యాపింగ్ కార్యక్రమం

విశాలాంధ్ర - నాయుడుపేట : నాయుడుపేట జిల్లాపరిషత్ బాలుర ఉన్నతపాఠశాల నందు శుక్రవారం జిల్లావిద్యాశాఖ అధికారి వి.శేఖర్ జిల్లాఅకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ శివశంకరయ్య ఆధ్వర్యంలో,స్కూల్ కాంప్లెక్స్ వారీగా స్కూల్స్ మ్యాపింగ్ కార్యక్రమం అధికారులు నిర్వహించారు.నాయుడుపేట ఎం.ఈ.ఓ.లు శాంతి,మునిరత్నం లకు జిల్లాఅధికారులు పలుసూచనలు చేశారు.స్కూల్ కాంప్లెక్స్ అడ్జస్ట్మెంట్లో భాగంగా జిల్లాఅధికారులు సూచనలమేరకు,మండలపరిధిలోని కాంప్లెక్స్ లకు స్కూల్స్ ని మ్యాపింగ్ చేశారు. గతంలో 8 కాంప్లెక్స్ లు మండల పరిధిలో ఉండగా వాటిని,ఏడు కి కుదించారు.ఎంఐఎస్లకు జియోమ్యాపింగ్ సంబంధించి శిక్షణ కార్యక్రమం కూడా జిల్లాఅధికారులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన చెప్పి బాయ్స్ హై స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని 10స్కూళ్ల అధ్యాపకులకు పలుసూచనలను జిల్లాఅధికారులు చేశారు.

ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలు

విశాలాంధ్ర-చౌడేపల్లి : స్థానిక ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా లో భాగంగా పలు క్రీడలను నిర్వహించారు మండలంలో గల తొమ్మిది ఉన్నత పాఠశాలలో నుంచి 300 మంది విద్యార్థులు ఈ క్రీడా కార్యక్రమములో పాల్గొన్నారు. కోకో కబడి వాలీబాల్ షటిల్ బ్యాడ్మింటన్ చెస్ యోగ వంటి క్రీడా పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందించారు. మండల స్థాయిలో జరిగిన ఈ క్రీడ ఉత్సవంలో ఎంఈఓ కేశవరెడ్డి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగరాజు రెడ్డి విద్యా కమిటీ చైర్మన్ సుధాకర్ ఉపాధ్యాయులు సుధాకర్ మురళి ఈశ్వర్ ఆయా పాఠశాలలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థులు వారి తల్లిదండ్రులు స్థానికులు పాల్గొన్నారు.

పాకాల రైల్వే స్టేషన్లో కొత్త కోచ్ డిపోకు

కేంద్ర రైల్వే శాఖ ఆమోదం

చిత్తూరు ఎంపీ దగ్గు మళ్ళ ప్రసాద్ రావు

విశాలాంధ్ర - చిత్తూరు: పాకాల రైల్వేస్టేషన్ లో కొత్త కోచ్ నిర్మాణానికి కేంద్ర రైల్వే శాఖ ఆమోదముద్ర వేసినట్లు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు ఒక ప్రకటన తెలిపారు. పాకాల రైల్వే స్టేషన్ బ్రిటిష్ కాలం నుంచి ఉండటమే కాకుండా,రెండు జిల్లాలైన చిత్తూరు, తిరుపతి ప్రాంతాలకు అనుసంధానమై ఉన్న పాకాల రైల్వే స్టేషన్ ప్రాధాన్యతను చిత్తూరు ఎంపీ కొత్త రైల్వే కోచ్ డిపోకి సంబంధించిన ప్రతిపాదనలను కేంద్ర రైల్వే శాఖామంత్రి సమర్పించారు. పాకాల రైల్వే స్టేషన్ ను ఆధునీకరించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపైకేంద్ర రైల్వే శాఖ పాకాల రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలలో ఎనిమిదిలో లైన్ల రైల్వే రహదారి మార్గాలలతో పాటు రైల్వే కొత్త కోచ్ డిపోను వచ్చే ఏడాది మార్చి నుంచి నిర్మించేందుకు సిద్ధమైనట్లు పేర్కొన్నారు. ఈ మేరకు సౌత్ సెంట్రల్ రైల్వే శాఖ ఆధ్వర్యంలో జరిగిన సేఫ్టీ మీటింగ్లో పాకాల రైల్వే స్టేషన్ కు సంబంధించి, రైల్వే కొత్త కోచ్ డిపో నిర్మాణానికి సూత్ర ప్రాయంగా ఆమోదం లభించింది అని తెలిపారు. ఈ నేపథ్యంలోసౌత్ సెంట్రల్ రైల్వే శాఖ గుంతకల్ డివిజనల్ ఆఫీస్ కు ఉత్తర్వులు జారీ అయ్యాయని, రైల్వే ఇంజనీరింగ్ అధికారులు కూడా వచ్చే ఏడాది మార్చి నుంచి పనులు చేపట్టేందుకు సిద్ధమవుతున్నట్లు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు తెలిపారు.

నేటి నుండి స్వచ్ఛతా హీ సేవ :కలెక్టర్

మహాత్మా గాంధీజీ జయంతి రోజున స్వచ్ఛ భారత్ దివస్

విశాలాంధ్ర-తిరుపతి సిటీ: జిల్లావ్యాప్తంగా నేటి నుంచి అక్టోబర్ ఒకటవ తేదీ వరకు నిర్వహించనున్న స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు అంకిత భావంతో చేపట్టి సంపూర్ణంగా స్వచ్ఛమైన మునిసిపాలిటీ, పంచాయతీలుగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.శుక్రవారం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాల నిర్వహణపై మునిసిపల్ కమిషనర్లు, ఎంపిడిఓ లు, ఈఓ పీఆర్డి లతో వర్చువల్ విధానంలో, జిల్లా అధికారులతో తదితరులతో సమీక్ష సమావేశం నిర్వహించి స్వచ్ఛత హి సేవా 2024 కార్యక్రమాల అమలుపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నేటి నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకు 15 రోజులు స్వభావ్ స్వచ్ఛత - సంస్కార్ స్వచ్ఛత అనే నినాదంతో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలు నిర్వహించుకోనున్నామని అన్నారు. అక్టోబర్ రెండవ తేదీన గాంధీ జయంతి రోజున వారి గుర్తుగా స్వచ్ఛభారత్ దివస్గా నిర్వహించుకోనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా అన్ని మున్సిపల్, పంచాయతీల పరిధిలో జిల్లాలోని అన్ని ప్రాంతాలలో స్వచ్ఛతకి భాగిదారి లో భాగంగా ప్రజాప్రతినిధులు, ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛభారత్ అమలుకు సిటిజన్ ఇన్ఫ్లుయెన్సర్లు, స్వచ్ఛంద సంస్థలు ఇతరులను భాగస్వాములు చేసి ప్రతి ఒక్కరూ ఇందులో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సి ఉంటుందని తెలిపారు. సభ్యులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. అలాగే సెప్టెంబర్ 16 న స్వచ్ఛత రన్, సైకిల్ థాన్, మారథాన్ లను పర్యటకశాఖ వారు ఇతర శాఖలతో సమన్వయం చేసుకొని చేపట్టాల్సి ఉంటుందని అలాగే సంపూర్ణ స్వచ్ఛత కింద గ్రామ నగరాలలో బ్లీచింగ్ లిక్విడ్స్ స్ప్రే వంటివి నీటి నిలువ ప్రాంతాల్లో గుర్తించి స్ప్రే చేయాల్సి ఉంటుందని అంతే కాకుండా ఆరోగ్యశాఖ వారు శానిటేషన్ వర్కర్లకు ఫస్ట్ ఎయిడ్ పై శిక్షణ అందించాల్సి ఉంటుందన్నారు. సెప్టెంబర్ 25న స్వచ్ఛభారత్ స్వచ్ఛ గ్రామపంచాయతీ కాంపిటీషన్లు నిర్వహించడం పబ్లిక్ ప్రాంతాలలో సుందరీ కరణ సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు ముఖ్యమైన కూడల్లలో ఏర్పాటు చేయడం, సెప్టెంబర్ 26న గ్రామ వార్డు సభలను నిర్వహించడం ఎక్కువ జనావాస ప్రాంతాలలో వీధులను శుభ్రపరచడం డ్రైవ్ కార్యక్రమం, సెప్టెంబర్ 27న చెత్త నుండి సంపద కేంద్రాల సుందరీకరణ వాల్ పెయింటింగ్ చేయడం ప్రజాభాగస్వామ్యంతో చెత్త నిర్వహణ పై అవగాహన కార్యక్రమాలు నిర్వహింస్తామన్నారు. తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ నారపు రెడ్డి మౌర్య, డిపిఓ సుశీల దేవి మాట్లాడుతూ ఈ క్యాంపెయిన్ లో భాగంగా ర్యాలీలు, మారథాన్ రన్, వర్క్ షాపులు, వైద్య శిబిరాలు వంటి కార్యక్రమాలు రోజువారీ షెడ్యూల్ మేరకు నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్, జిల్లా, డిప్యూటీ సిఈఓ ఆది శేషా రెడ్డి, డివిజన్, మునిసిపల్, మండల తదితర అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ హాస్పిటల్ అభివృద్ధికి నిధులు కేటాయించండి

ఆరోగ్య శాఖ మంత్రి ని కలిసిన ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్

విశాలాంధ్ర-పుత్తూరు టౌన్: నగరి ఏరియా హాస్పిటల్ నగరి పుత్తూరు హాస్పిటల్ అభివృద్ధికి నిధులు కేటాయించండని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ని నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరి ఏరియా ఆసుపత్రి, పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి నందు గల సమస్యలు తెలిపారు. రోగులు కావలసిన వసతులు సరిపోవడం లేదని, అందుకు భవన నిర్మాణాలు, ఆసుపత్రుల అభివృద్ధి కు అవసరమైన నిధులు మంజూరు చేయాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. అందుకు స్పందించిన ఆరోగ్య శాఖ మంత్రి మీకు ఎంత అవసరమో వాటిని నివేదికలు పంపినట్లయితే ముఖ్య మంత్రి దృష్టికి తీసుకెళ్లి మీకు కావలసిన నిధులు మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

రైతులకు సబ్సిడీ విత్తన పంపిణీ

చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పంపిణీ

విశాలాంధ్ర-యర్రావారి పాళ్యం: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సబ్సిడీ "ఉలవలు" విత్తన పంపిణీని యర్రావారి పాళ్యం మండలం, బోడే వాండ్లపల్లి పంచాయతీలో ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రారంభించారు. ముందుగా ఎమ్మెల్యే గారికి కూటమి మండల పార్టీ నాయకులు అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. శాలువాలతో పూలమాలలతో బొకేలతో సత్కరించి ఆహ్వానం పలికారు. తెదేపా ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు కాకమునుపే మొదటి విడతలో సబ్సిడీ పై శనక్కాయలు పంపిణీ చేసి రెండవ విడత ఉలవలు పంపిణీ చేస్తున్నారు. దీనిని బట్టి రైతులపై ప్రభుత్వం ఎంత శ్రద్ధ చూపుతుందో అర్థం చేసుకోవచ్చున్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. అనంతరం 80 శాతం సబ్సిడీతో ఉలవలు విత్తనాలు లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో రైతులు, అధికారులు, ఉమ్మడి పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హిందీ భాష నేర్చుకోవడం వల్ల ఉపాధి అవకాశాలు మెండు

విశాలాంధ్ర-పుత్తూరు టౌన్ : హిందీ భాష నేర్చుకోవడం వలన ఉపాధి అవకాశం ఎక్కువగా ఉంటున్నాయని గొల్లపల్లి జిల్లా పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భారతి తెలిపారు. శుక్రవారం పుత్తూరు రూరల్ మండలం గొల్లపల్లి ఉన్నత పాఠశాలలో జాతీయ భాషా హిందీ దినోత్సవం పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు భారతీ అధ్యక్షతన హిందీ ఉపాధ్యాయులు ఎన్.శ్రీరాములు జి.చంద్రశేఖర్ల ఆధ్వర్యంలో జాతీయ భాషా హిందీ దినోత్సవం వేడుకలు చాలా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయురాలు భారతి మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రధాన భూమిక పోషించింది హిందీ అని, మన జాతీయ భాష హిందీని నేర్చుకోవడం వల్ల అందరినీ ఏకతాటి పైకి వచ్చేలా చేసిన భాష హిందీ అని కొనియాడారు. అనంతరం హిందీ ఉపాధ్యాయులు ఎన్.శ్రీరాములు, జి చంద్ర శేఖర్లు మాట్లాడుతూ హిందీ మాతృ భాష జాతీయ భాషగాను వర్ధిల్లు తున్నదని, హిందీ భాష నేర్చుకోవడం వలన ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని సంస్కృతి సంప్రదాయాలు పెంపొందించేలా చేసే శక్తి హిందీ భాషకు మాత్రమే ఉందని కొనియాడారు. అనంతరం వ్యాస రచన పోటీలు, వక్తృత్వ పోటీలు, చిత్రలేఖనం పోటీలు, క్విజ్ పోటీలు, నృత్య పోటీలలో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి గా జామెంట్రీ బాక్సులు, ద్వితీయ బహుమతిగా ఎగ్జామ్ పాడ్లు,తృతీయ బహుమతి ఐరెన్ స్కేలు ప్రదానం చేశారు. జాతీయ గీత ఆలాపనతో హిందీ భాషా దినోత్సవం వేడుకలు చాలా ఘనంగా ముగిసాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరద బాధితుల కోసం విద్యార్థులు విరాళాల సేకరణ

విశాలాంధ్ర-పుత్తూరు టౌన్ : విజయ వాడ వరద బాధితులను ఆదుకోవడం కోసం పుత్తూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న ఎన్సిసి, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై. కోటేశ్వరయ్య అనుమతితో విరాళాలు సేకరించారు. విద్యార్థుల సేకరించిన 27 వేల రూపాయలను ముఖ్యమంత్రి సహాయ నిధికి డిమాండ్ డ్రాఫ్ట్ తీసి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. కోటేశ్వరయ్య జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్కు శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి కోటేశ్వరయ్య ఎన్సిసి అధికారి డాక్టర్ యం.శ్రీనివాసులు, ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ కే. శ్రీనివాసులు, రఘురామన్, ఎన్ సిసి,ఎన్ఎస్ఎస్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు జిల్లా విద్యాశాఖ విరాళం

విశాలాంధ్ర - తిరుపతి రూరల్ :రాష్ట్రంలో వరదలతో అతలాకుతలమైన ప్రజల సహాయార్థం తిరుపతి జిల్లా విద్యా శాఖ సిబ్బంది లక్ష రూపాయల విరాళాన్ని చెక్కు రూపంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లుకు అందించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ గురుస్వామి రెడ్డి మాట్లాడుతూ సాటి ప్రజలు వరదలతో ఎన్నో ఇబ్బందులకు గురవడం అందరిని కలిచి వేసిందన్నారు. అక్కడి పరిస్థితులను గమనించిన తమలో ఎంతో మానసిక వేదన కలిగిందని,విద్యాశాఖలో అందరూ మాట్లాడుకుని తమ వంతుగా లక్ష రూపాయలను పోగుచేసి ముఖ్యమంత్రి సహాయ నిధికి కలెక్టర్ ద్వారా అందించినట్లు చెప్పారు.అన్ని వర్గాలవారు ఇతోధికంగా వీలైనంతగా వరద ముంపు బాధితులకు సహాయ సహకారాలు అందించాలని కోరుతున్నామన్నారు

సీతారాం ఏచూరికి ఘన నివాళి

విశాలాంధ్ర- ఏర్పేడు: సిపిఎం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి ఏర్పేడు మండల కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తలారి బాలకృష్ణ మాట్లాడుతూ ఆయన మరణించడం బాధాకరమని వారి మరణం కమ్యూనిస్టు పార్టీ ఉద్యమానికి తీరనిలోటు అన్నారు. ఏచూరి ఆశయాలను అంకితమై ముందుకు తీసుకెళ్లాలన్నారు. వారికి సంతాపం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయకార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యు రాలు కలపాటిగురవమ్మ ఆటో కార్మికుల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలను పరిశీలించిన తహసిల్దార్

విశాలాంధ్ర- దొరవారి సత్రం: దొరవారి సత్రం మండల పరిధిలోని అయ్యపాలెం గ్రామ సమీపంలోని నెర్రి కాలవ పోరంబోకు భూములను ఆక్రమించి చిల్లర దుకాణాలను ఏర్పాటు చేశారు. ఈ విషయంపై స్థానికులు జిల్లా కలెక్టర్ ఫిర్యాదు చేసారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం తహసిల్దార్ శైల కుమారి, మండల సర్వే రు టి రామారావు, ఇరిగేషన్ శాఖ ఏఈ కస్తూరయ్య ఈ కాలవపై నిర్మించిన అక్రమ కట్టడాలను పరిశీలించారు. ఈ అక్రమ కట్టడాలపై ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తహశీల్దారు అన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనాలను అందించాలన్నారు. విద్యార్థుల భోజనాల పట్ల ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.

చవితి ఉత్సవాల్లో అలరించిన కళాకారుల నృత్య ప్రదర్శనలు

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి పట్టణంలోని శ్రీ శ్రీ శ్రీ, జ్ఞాన సిద్ధి వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా 6వ రోజు సాంస్కృతిక కార్యక్ర మాలలో కళాకారుల నృత్య ప్రదర్శనలు అందరిని అలరించాయి. శ్రీకాళహస్తి పట్టణం గాంధీ వీధిలో వెలసి ఉన్న "శ్రీ,శ్రీ, శ్రీ,జ్ఞాన సిద్ది వినాయక స్వామి" వారి ఆలయం చాలా కాలంగా ప్రసిద్ధి చెందినది, నిత్యకైంకర్యాలతో ఆలయ పూజారి వారితో విశేష పూజలు అందుకుంటున్నట్టువంటి నేపథ్యంలో 6వ రోజు కార్యక్రమాలలో భాగంగా శ్రీకాళహస్తి డిఎస్పి కె. నరసింహమూర్తి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రంగినేని చెంచయ్య నాయుడు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. తెలుగుదనం ఉట్టిపడే రీతిలో కళాకారులను ప్రోత్సహిస్తూ కళాకారుల నృత్యాలను అందరిని అలరించాయి. అనంతరం కళాకారులను అభినందిస్తూ వారికి ప్రోత్సాహమైనటువంటి బహుమతులను ముఖ్య అతిథులు చేతుల మీదుగా ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి ధర్మకర్తల మండలి మాజీ సభ్యులు కాసరం రమేష్, వాకచర్ల గుర్రప్ప శెట్టి, శ్రీకాళహస్తి కోఆపరేటివ్ టౌన్ బ్యాంక్ మాజీ సభ్యులు బాలు ఢిల్లీ బాబు, ఎస్.పి. కుమార్, ఆలయ కమిటీ సభ్యులు కిషోర్, మధు, వరదరాజులు, కుప్పయ్య వివేక్ మహేష్, ఎం.పి.సీను, రాకేష్, నవీన్, మైనంపాటి సుధ, మణికంఠ, ధన, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకి మద్దతుగా ప్రజా సంఘాల నాయకులు

విశాలాంధ్ర - పిచ్చాటూరు: ఎమ్మెల్యే ఆదిమూలంకి అండగా సత్యవేడు అంబేద్కర్ సంఘాలు ప్రజా నాయకులు శాంతి యుతంగా ధర్నా చేపట్టారు. నియోజకవర్గం మొత్తం ఏడు మండలాల ప్రజలు ఆదిమూలంకి మద్దతుగా నిలుస్తూ భారీ ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ సత్యవేడులో ఎన్నడూ లేని విధంగా ఇలా దిగజారుడు రాజకీయాలు చెయ్యడం మంచి పరిణామం కాదని ఆదిమూలం గారిని కావాలనే ఈరికించ్చారని సాక్షాధారాలతో పూర్తి స్థాయిలో విచారణ జరిపి నిజం నిజాలు బయటపెట్టాలని మీడియా సమక్షంలో డిమాండ్ చేశారు. ఒక దళిత నాయకుడిని ఇలా ఇరికించడం మంచి పరిణామం కాదని గుర్తు చేసారు. ఆదిమూలం గారికి సత్యవేడు నియోజకవర్గంలో ప్రజా సంఘాలు, అంబేద్కర్ సంఘాల సభ్యులు యువత ఆదిమూలం గారికి మద్దతుగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రజిని, వెంకటాద్రి, మౌనరాజ్, హరి, రంజిత్, రాహుల్, సతీష్,పాల్గొన్నారు.

బొమ్మసముద్రం ప్రభుత్వ పాఠశాల, కళాశాల వెనుక గొప్ప చరిత్ర

చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్

విశాలాంధ్ర - గుడిపాల : చిత్తూరు నియోజకవర్గం గుడిపాల మండలంలోని స్థానిక బొమ్మసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల స్వర్ణోత్సవ వేడుకలకు శుక్రవారం ఉదయం 11 గంటలకు ముఖ్య అతిథిగా హాజరైన చిత్తూరు ఎమ్మెల్యే శ్రీ గురజాల జగన్ మోహన్. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ చిత్తూరులోని పిసిఆర్, పీవీకేఎన్, సావిత్రమ్మ మహిళ కళాశాల, కన్నన్ జూనియర్ కళాశాల వంటి అన్ని కళాశాలల వెనుక ఒక్కో విద్యా ప్రదాత చరిత్ర ఉందన్నారు. బొమ్మసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల వెనుక . రెడ్డి కృషి ఉందన్నారు. అటువంటి మహనీయుల త్యాగ ఫలితంగా ఎందరో విద్యార్థులు ఉన్నత పదవులను అలంకరించారని తెలిపారు. గురువుల ఆశీస్సులతోనే తాను మొదటి ప్రయత్నంలోనే రాజకీయంలో ఎమ్మెల్యేగా గెలుపొందడం జరిగిందన్నారు. ప్రతి విద్యార్థి గురువులను గౌరవిస్తే వారి భవిష్యత్తు ఉన్నత స్థాయికి ఎదుగుతుందని స్పష్టం చేశారు. ఈ స్వర్ణోత్సవ వేడుకల్లో ప్రిన్సిపల్ శరత్చంద్ర, ఎమ్మెల్యే తండ్రి జీజేయం చారిటబుల్ ఫౌండేషన్ నిర్వాహకులు గురజాల చెన్న కేశవులు నాయుడు, టిడిపి సీనియర్ నాయకులు బాలాజి నాయుడు, జెడ్పీ చైర్మన్ గోవిందప్ప, జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య, మాజీ ఎమ్మెల్యే గాంధీ, స్థానిక నాయకులు, అధ్యాపకులు, విద్యార్థిని మరియు విద్యార్థులు పాల్గొని స్వర్ణోత్సవ వేడుకలు జరుపుకున్నారు.

ప్రతి విద్యార్థి క్రీడ పోటీలలో పాల్గొనాలి

విశాలాంధ్ర - నాయుడుపేట : తిరుపతి జిల్లా జిల్లా విద్యాశాఖ అధికారి వి.శేఖర్ శుక్రవారం నాయుడుపేట విద్యాశాఖ అధికారులు మునిరత్నం,శాంతి లతో కలిసి స్థానిక ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలలో విధులు నిర్వహించే ఫిజికల్ డైరెక్టర్ లతో స్థానిక వ్యాయామ ఉపాధ్యాయులుతో సమావేశమయ్యారు. సెప్టెంబర్ 19,20 తారీకులలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ లో భాగంగా మండల స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈపోటీలలో ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలల్లో విద్యను అభ్యసించే ప్రతి విద్యార్థి పాల్గొనేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని ఆయన అన్నారు. ఈపోటీలు నాయుడుపేటనందు జడ్పీ బాయ్స్ హైస్కూల్ వేదికగా నిర్వహించినట్లు ఆయన తెలిపారు. అండర్14,అండర్17 విభాగాలలో మండల స్థాయి పోటీలు వివిధ విభాగాలలో నిర్వహిస్తామని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించ నున్న ఈ పోటీలు క్రీడస్ఫూర్తితో నిర్వహించాలని ఆయన కోరారు.

నేడు ఆముదాల మురళిచే ధార్మికోపన్యాసం

విశాలాంధ్ర-పలమనేరు :వినాయక చవితి సందర్భంగా నిర్వహిస్తున్న ఉత్సవాలలో భాగంగా పండితులు, ప్రముఖ శతావధాని శ్రీ ఆముదాల మురళిచే సాయి గార్డెన్ సిటీ నందుగల వినాయక స్వామి దేవాలయము నందు శనివారం సాయంత్రం 7 గంటలకు ధార్మిక ఉపన్యాసం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు గుణశేఖర్,ఆనందబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో విరివిగా భక్తులు పాల్గొని విజయవంతం చేయగలరని కోరారు. కార్యక్రమానంతరం ప్రసాద వితరణ ఉంటుందనన్నరు.

ఎవ్వరూ అధైర్య పడవద్దు-అండగా మేముంటాం

కార్యకర్తలకు భరోసా ఇచ్చిన మాజీ ఎమ్మెల్యే

విశాలాంధ్ర - పలమనేరు : ఎవ్వరూ అధైర్య పడవద్దని అండగా నేనుంటానని కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే వెంకటే గౌడ తెలిపారు. అందులో భాగంగా స్థానిక వైసిపీ కార్యాలయం లో పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలమనేరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా ఎన్నికైన జయ శంకర్ కి శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో సత్కరించి మరెన్నో సేవా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని కోరారు. ఈ సమావేశంలో హేమంత్ కుమార్ రెడ్డి, చెంగా రెడ్డి,ప్రహ్లాద, గిరి రాజా రెడ్డి, చంద్రప్ప, కోదండరామయ్య, తదితరులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి

విశాలాంధ్ర - పాకాల : గురువారం మృతి చెందిన సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి శుక్రవారం పాకాల మండలంలో ఘన నివాళులు అర్పించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఆటో స్టాండ్ వద్ద సీతారాం ఏచూరి చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కామ్రేడ్ సీతారాం ఏచూరి మరణం చాలా బాధాకరమని ఆయన మృతి దేశానికి, అభ్యుదయ ఉద్యమానికి, వామపక్షాలకు,తీరని లోటని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం,సిఐటియు,కెవిపిఎస్ నాయకులు,ఆటో యూనియన్ వర్కర్లు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత :ఏఈ

విశాలాంధ్ర - తడ : తిరుపతి జిల్లా తడ మండల పరిధిలోని అన్ని గ్రామాలలో 14వ తేదీన శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు స్థానిక విద్యుత్ శాఖ ఏఈ మురళి పేర్కొన్నారు. విద్యుత్ మరమ్మత్తు,విద్యుత్ పోల్స్ వద్ద చెట్లు తొలగింపు వంటి మెయింటనెన్స్ పనులకు గాను శనివారం ఉదయం 6 గంటల నుంచి 10:00 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని దీన్ని గమనించి వినియోగదారులు విద్యుత్ శాఖకు సహకరించాలన్నారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి

విశాలాంధ్ర-పలమనేరు :పలమనేరు పట్టణ సిపిఎం పార్టీ ఆఫీస్ నందు శుక్రవారం కామ్రేడ్ సీతారాం ఏచూరి కి ఆ పార్టీ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి మౌనం పాటించారు కామ్రేడ్ సీతారాం ఏచూరి సిపిఎం పార్టీ అఖిలభారత కార్యదర్శిగా ఉంటూ అనారోగ్య కారణాల రీత్యా చనిపోవటం చాలా బాధాకరమన్నారు . 50 సంవత్సరాలుగా విద్యార్థి దశ నుండి చివరి వరకు పార్టీ ఉద్యమమే ఊపిరిగా పనిచేసినటువంటి మహనీయుడు సీతారాంఏచూరి అని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమం లో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గిరిధర్ గుప్తా, ఓబుల్ రాజు, భువనేశ్వరి, పలమనేరు పట్టణ శాఖ కార్యదర్శి ఈశ్వర్, ఎల్ఐసి నాయకులు మునిరాజులు పార్టీ నాయకులు సావిత్రి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు గడువు పొడిగింపు

విశాలాంధ్ర -తిరుపతి రూరల్ :ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఓపెన్ స్కూల్ 10వ తరగతి ఇంటర్మీడియట్ కోర్సులలో ప్రవేశాలకు ఈనెల 25 వ తేదీ వరకు అపరాధ రుసుముతో గడువు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ శేఖర్, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ గురుస్వామి రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేయదలుచుకున్న వారు ఈనెల 25 వ తేదీ లోపల ఏపీ ఆన్లైన్ ద్వారా గాని సచివాలయంలో గాని చేసుకోవచ్చని తెలియపరిచారు. 2024- 25 విద్యా సంవత్సరం నష్టపోకుండా ఓపెన్ స్కూల్ నందు ప్రవేశాలు పొందగలరని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర-తొట్టంబేడు: శ్రీకాళహస్తి విద్యుత్ శాఖ డివిజను పరిధిలో రెండవ శనివారం పురస్కరించుకుని మరమ్మతుల కోసం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా ఆపేస్తున్నట్లు ఆ శాఖ గ్రామీణ ఈఈ వాసురెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. శ్రీకాళహస్తి పట్టణం, శ్రీకాళహస్తి గ్రామీణం, తొట్టంబేడు, ఏర్పేడు, కేవీబీపురం, బుచ్చినాయుడుకండ్రిగ మండలాల్లో విద్యుత్ సరఫరా ఆపేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఇది గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కాగా లోక్ అదాలత్ నేపథ్యంలో శ్రీకాళహస్తి న్యాయస్థానం పరిధిలో విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. స్థానికులు ఇది గమనించాలని వాసురెడ్డి సూచించారు.

16 నుంచి విజయవాడ ఆర్టీసీ బస్సు పునరుద్ధరణ : డిఎం

విశాలాంధ్ర – చౌడేపల్లి : ఈనెల 16 నుంచి విజయవాడకు లగ్జరీ ఆర్టీసీ బస్సు సర్వీసును పునరుద్ధరిస్తున్నట్లు పుంగనూరు డిపో మేనేజర్ సుధాకరయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ కేంద్ర కార్యాలయ ఆదేశాల మేరకు విజయవాడకు బస్సును పునరుద్ధరిస్తున్నామన్నారు. పుంగనూరులో లగ్జరీ ఆర్టీసీ బస్సు ఈనెల 16న సాయంత్రం 5:10 నిమిషాలకు బయలుదేరి చౌడేపల్లి సోమల సదుం కల్లూరు మీదుగా పీలేరుకు సాయంత్రం 6:40 లకు చేరుకుంటుందన్నారు. ఈ బస్సుకు ఏపీఎస్ఆర్టీసీ ఆన్లైన్ ద్వారా రిజర్వేషన్ టికెట్స్ సౌకర్యం ఉంటుందన్నారు బస్సు సర్వీస్ నెంబర్ 47279, 47280 గా నిర్ధారించడం జరిగిందని ఆయా ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ సుధాకరయ్య కోరారు.

సొసైటీలు కంప్యూటరీకరణ

విశాలాంధ్ర – గూడూరు : గూడూరు నెం.24 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆవరణంలో డివిజనల్ సహకార శాఖ అధికారి రవి రాజ శేఖర్ అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సహకార సంఘాలను కంప్యూటరీకరణ చేస్తున్నారు అన్నారు. ఇందులో భాగంగా సంఘ సభ్యులు ప్రతి ఒక్కరూ కే.వై.సి డిటైల్స్ ను సొసైటీ కి అందించాలన్నారు. ఇక నుండీ ఆన్లైన్ విధానం లోనే సహకార సంఘ కార్యకలాపాలు జరుగుతాయని తెలిపారు. ప్రతి రైతుకూ ఆన్లైన్ ద్వారా అన్ని సేవలు అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ విద్యా సాగర్,పర్సన్ ఇంచార్జీ శ్యాం కుమార్, గూడూరు డిసిసిబి మేనేజర్ సత్యవతి, గూడూరు సీఈఓ నారాయణ, తిప్ప గుంట పాలెం సిఈఓ రామయ్య, గూడూరు పట్టణ, మండల టిడిపి అధ్యక్షులు తెలుగు శ్రీనివాసులు, వెంకటేశ్వరరాజు, గూడూరు నెం.24 ,పిఎసిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

రుయా హాస్పిటల్లో ఫ్రైడే డ్రై డే కార్యక్రమం

విశాలాంధ్ర- తిరుపతి: రుయా హాస్పిటల్ నందు శుక్రవారం డ్రై"డే ఫ్రైడే, కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని రుయా హాస్పిటల్ హెల్త్ సూపర్వైజర్ కే.ఆర్. ప్రకాష్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని వివరించారు. హాస్పిటల్ నందు మురికి కాలువలను శుభ్రం చేయడంతో పాటు దోమల నివారణకు పిచికారి కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతున్నదని తెలియజేశారు. రోగులు దోమల నివారణకు గురికాకుండా ఉండేందుకు పీచుకారి కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతున్నదని తెలిపారు. ఆసుపత్రిలో రోగులు కూడా చెత్తను ఎక్కడపడితే అక్కడ ఆసుపత్రి ఆవరణంలో వేయరాదని సూచించారు. ఆసుపత్రి పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రంగా ఉండేందుకు అందరు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పేస్ట్ కంట్రోల్ సిబ్బంది, ఏ. వన్ .సర్వీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అకాడమీ కన్సల్టెంట్ నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేయాలి

విశాలాంధ్ర- తిరుపతి: 2019 నుంచి,2024 జరిగిన అక్రమ నియామకాల మీద విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలి. టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరానికి అకాడమీ కన్సల్టెంట్ నియామకానికి కొత్తగా నోటిఫికేషన్ విడుదల చేసి ఇంటర్వ్యూలో నిర్వహించాలని టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆర్కే నాయుడు మాట్లాడుతూ గతంలో 2019 నుంచి కొంతమంది కేవలం రాజకీయ కార్యకలాపాల కోసమే ఇక్కడ అకాడమీ కన్సల్టెంట్గా నియామకం కాబడి ప్రతిభ లేకపోయినా, క్లాసులు చెప్పకపోయినా అధికార బలంతో యూనివర్సిటీ ఆదాయానికి గండి కొట్టడం జరిగింది .ప్రతిభ కలిగిన అర్హత కలిగిన అనేక మంది రాజకీయ కక్షలతో అకాడమిక్ కన్సల్టెంట్లుగా పనిచేస్తున్న వారిని తొలగించడం జరిగింది కావున తమరు నూతన విద్యా సంవత్సరానికి గాను కొత్త నోటిఫికేషన్ ఇవ్వవలసిందిగా కోరుకుంటున్నాం అదేవిధంగా విశ్వవిద్యాలయాల్లో నాన్ టీచింగ్లో ఎటువంటి నియామకాలు జరగకూడదని నిబంధనలు ఉన్న దానిని తుంగలో తొక్కి కేవలం ఎస్వీ యూనివర్సిటీని తమ రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు, శ్రీరామ్ భీష్మ రవి రామంజి భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

కాలువల్లో చెత్త తొలగింపు పనులు త్వరగా పూర్తి చేయండి:కమిషనర్

విశాలాంధ్ర – తిరుపతి : నగరంలోని ప్రధాన కాలువల్లో జరుగుతున్న చెత్త తొలగింపు పనులు రెండు, మూడు రోజుల్లోపు త్వరగా పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధిలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను, మురుగు కాలువల్లో చెత్త తొలగింపు పనులను శుక్రవారం ఇంజనీరింగ్, హెల్త్ అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మౌర్య మాట్లాడుతూ ప్రధాన కాలువల్లో పేరుకుపోయిన చెత్తా చెదారం తొలగించే పనులు వేగవంతం చేసి రెండు మూడు రోజుల్లో పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కాలువల్లో తొలగించిన చెత్త తడితరాలను ఎప్పటికప్పుడు తరలించాలని అన్నారు. వర్షాలు ప్రారంభమైతే కాలువల్లో ఎక్కడికక్కడ నీరు ఆగిపోయి రోడ్లపై నీరు వచ్చే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. దీని వలన ప్రజలకు ఇబ్బంది అవుతుందని, త్వరగా పనులు పూర్తి చేయించాలని అన్నారు. నగరంలో ఎక్కడ కూడా గార్బేజ్ వల్నరబుల్ పాయింట్స్ (జి.వి.పి) లో చెత్త లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని హెల్త్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ఖాళీ స్థలాల్లో చెత్త తొలగింపు పనులు కూడా త్వరగా పూర్తి చేయాలని అన్నారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మున్సిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకటరామిరెడ్డి, డి.ఈ. విజయ్ కుమార్ రెడ్డి, మహేష్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, శానిటరీ సూపర్వైజర్స్ చెంచయ్య, సుమతి తదితరులు ఉన్నారు.

బ్యాంకుల్లోనే నేరుగా రుణం సొమ్ము చెల్లించాలి:ఏపిఎం

విశాలాంధ్ర- సత్యవేడు: గ్రామ సమైక్య ఆర్థిక లావాదేవీల రుణాలకు సంబంధించిన వాయిదా సొమ్మును నేరుగా బ్యాంకుల్లోనే చెల్లించాలని సత్యవేడు గ్రామీణ అభివృద్ధి సంస్థ(వెలుగు) ఏపిఎం స్వర్ణలత కోరారు.శుక్రవారం శ్రీశక్తి భవనంలో ఆర్థిక అక్షరాస్యతపై వివో లీడర్లకు అవగాహన కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ఏపీఎం స్వర్ణలత మాట్లాడుతూ ఆధునిక సమాజంలో మనుగడ సాగాలంటే ఆర్థిక అక్షరాస్యత తప్పనిసరి అన్నారు.ముఖ్యంగా గ్రామ సమైక్య ద్వారా మంజూరుతున్న రుణాలకు సంబంధించిన చెల్లింపు పారదర్శకంగా ఉండాలన్నారు. ఆయా బ్యాంకులకు ఫామ్ 16 సమర్పించి ఒకేసారి వాయిదా సొమ్ము చెల్లించుకోవచ్చును అన్నారు ఈ సమావేశంలో వెలుగు కోఆర్డినేటర్ పయని, అకౌంటెంట్ కాంచన,మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు కోటేశ్వరి, కోశాధి కారి సుజాత, కార్యదర్శి మంజుల, శకుంతల, పలువురు వివో లీడర్లు పాల్గొన్నారు.

కోలా ఆనంద్కు దర్గా ఉరుసు ఉత్సవాలకు ఆహ్వానం

విశాలాంధ్ర – శ్రీకాళహస్తి : ఈ నెల 26వ తేదీ నుంచి జరిగే దర్గా ఉరుసు ఉత్సవాలకు బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోలా ఆనంద్ని కలిసి దర్గా పీఠాధిపతి కమిటీ నిర్వాహకులు ఆహ్వానం పలికారు. శ్రీకాళహస్తి పట్టణం దర్గా వీధిలో ఉన్న హజరత్ జిష్మే షాఫీర్ దర్గా ఉరుసు ఉత్సవాలు ఈ నెల 26వ తేదీ నుంచి 29 వరకు జరుగనున్నారు. ఈ మేరకు దర్గా పీఠాధిపతి సయ్యద్ అహ్మద్, దర్గా నిర్వాహకులు సయ్యద్ బాబా ఫరీద్ వారి ఆధ్వర్యంలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోలా ఆనంద్ను కలిసి ఉరుసు ఉత్సవాలు యొక్క ఆహ్వాన పత్రి కను అందించి దర్గా గందో మహోత్సవంలో పాల్గొనాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో దర్గా ఉరుసు కమిటీ ప్రెసిడెంట్ నాగేశ్వరరావు, న్యాయవాదులు గుమ్మల రాజేశ్వరరావు, గరికపాటి రమేష్ బాబు, కన్వీనర్ ఎంఎస్ జమురుద్ బాదుషా, పి.రహీం ఖాన్, యాకూబ్ పాల్గొన్నారు.

ఉత్తమ గురువులకు సత్కారం

విశాలాంధ్ర -శ్రీకాళహస్తి: సర్వేపల్లి రాధా కృష్ణన్ జయంతి సందర్భంగా శ్రీకాళహస్తి ప్రాంతం నుంచి జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన పలువురిని పిళ్ళారి పౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సత్కరించారు. స్థానిక సరస్వతీ భాయి మున్సిపల్ ఉన్నతపాఠశాల ఆవరణలోని పిళ్ళారి కళావేదికలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా పిళ్ళారి పౌండేషన్ నిర్వాహకురాలు పిళ్ళారి అమరావతి మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజ దిశ, దశకు అసలైన దార్శనీకులని కొనియాడారు. అనంతరం జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన కూనాటి సురేష్ తో పాటు జిల్లా స్థాయి అవార్డులు పొందిన మరో 13 మంది ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. శ్రీకాళహస్తి ఎంఈఓ భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

దర్గాను దర్శించుకున్న డిఎస్పీ, సిఐ

విశాలాంధ్ర – శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తిలోని స్వర్ణముఖి నది వద్ద వెలిసి ఉన్న హజ్రత్ జంలేషావలి ఫీర్ దర్గాను శ్రీకాళహస్తి డివిజన్ డిఎస్పి నర్సింహమూర్తి, వన్టౌన్ సిఐ గోపి శుక్రవారం దర్శించుకున్నారు. ముందుగా దర్గా కమిటీ సభ్యులు డిఎస్పి, సిఐలకు స్వాగతం పలికి హజ్రత్ జంలేషా పీర్ దర్గా దర్గా పీఠాధిపతి సయ్యద్ అహ్మద్ దర్గా నిర్వాహకులు సయ్యద్ బాబా ఫరీద్ దర్శన ఏర్పాట్లు నిర్వహించారు. దర్గా స్వామి దర్శనానంతరం డిఎస్పి నర్సింహమూర్తికి, వన్ టౌన్ సిఐ గోపి కు బాబా శేష వస్త్రాన్ని బహుకరించి దర్గా విశిష్టతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దర్గా ఉరుసు కమిటీ ప్రెసిడెంట్ ఓరుగంటి నాగేశ్వరరావు, న్యాయవాదులు గుమ్మల రాజేశ్వరరావు, గరికపాటి రమేష్ బాబు, కన్వీనర్ ఎంఎస్ జమురు బాదుషా, మొహమ్మద్ అన్సర్, షేక్ దిలావర్, హుస్సేన్, షేక్ మస్తాన్ వలి, రామ చంద్రయ్య, కే ఉదయ భాస్కర్, యాకుబ్, పి బావా జాన్, రహీమ్, ఖాన్, దర్గా మీడియా ప్రతినిధి హకీమ్ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు విద్యార్థుల దూరంగా ఉండాలి:సిఐ

విశాలాంధ్ర – బుచ్చినాయుడు కండ్రిగ : యువత మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. మండలంలోని కనమనంబేడు గ్రామంలో ఉన్న ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలలో శుక్రవారం ఎస్సై విశ్వనాథ్ నాయుడు ఆధ్వర్యంలో విద్యార్థులకు మత్తు పదార్థాలు వాడకం వాటి వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు కల్పించారు. ఈ సందర్భంగా సీఐ తిమ్మయ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగంపై పోకిరి విద్యార్థులు చెడు వ్యసనాలకు గురిచేయడం దారి తీస్తున్నదన్నారు. మాదక ద్రవ్యాల ప్రలోభానికి గురై బంగారు భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని విద్యార్థులు, యువతకు సూచించారు. మాదక ద్రవ్యాలు ప్రమాదకర వ్యసనమన్నారు. చెడు మార్గంలో నడిపిస్తుందన్నారు. విద్యార్థులు చదువు మానేసి సర్వస్వం కోల్పోతారన్నారు. కాలేజీ విద్యార్థులు ముఖ్యంగా యుక్త వయసులో చెడు సహవాసాలు చేయొద్దన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ధర్మేంద్ర కుమార్ సింగ్. పోలీసులు రేగన్, నాగరాజు లు పాల్గొన్నారు .

ఓపెన్ యూనివర్సిటీ విద్యార్థులకు

పరీక్ష ఫీజు చెల్లింపుకు 20 ఆఖరు

విశాలాంధ్ర-పుత్తూరు టౌన్ : పుత్తూరు ఎస్ ఆర్ ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ ఇన్ సిటీ స్టడీ సెంటర్లో చదువుతున్న విద్యార్థులు సెకండ్ సెమిస్టర్ ఎగ్జామ్ ఫీజ్ చెల్లించుటకు ఈనెల 20వ తేదీ ఆఖరు అని స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ టి నరసింహులు తెలిపారు. అలాగే ద్వితీయ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ట్యూషన్ ఫి చెల్లించుటకు ఈనెల 30వ తేదీ చివరి తేదీ అని తెలిపారు. ఇతర వివరాలకు 9515401088,7382929641 లను సంప్రదించాల్సిందన్నారు.

ఎస్వీ యూనివర్సిటీ ఆరోగ్య కేంద్రంలో మందుల కొను 'గోల్మాల్'

ఉన్నతస్థాయి విచారణ కమిటీతో అవినీతిని నిగ్గుతేల్చాలి -సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు డిమాండ్

విశాలాంధ్ర-తిరుపతి: శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ ఆరోగ్య కేంద్రంలో గడచిన ఐదు సంవత్సరముల కాలంలో మందులు మరియు ల్యాబ్ కెమికల్స్ కొనుగోళ్లలో భారీ అవినీతి జరిగినది. వీటిపై విచారణకు డిమాండ్ చేస్తూ ఆరోగ్య కేంద్రంలో వైకాపా అవినీతి పాలనలో తాత్కాలిక ఉద్యోగులుగా చేరిన డాక్టర్ సుధాకర్ రెడ్డి, డాక్టర్ అలేఖ్య గారి పర్యేక్షణలో మందులు కొనుగుళ్ళు చేశారు. ఈ డాక్టర్లు ముఖ్యంగా మూడు మెడికల్ ఏజెన్సీస్ శ్రీ కళ్యాణ్ ఫార్మా, తిరుపతి, శ్రీ వినాయక ఏజెన్సీస్ హైదరాబాద్, బ్లూ స్టార్ ఎంటర్ప్రైజెస్, విజయవాడ మరో రెండు సంస్థలతో అక్రమంగా లోపాయికారీ ఒప్పందం చేసుకొని దాదాపు 40 లక్షల రూపాయల నాసిరకం మందులు పైమెడికల్ ఏజెన్సీస్ నుంచి కొనుగోళ్లు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సుధాకర్ రెడ్డిని తొలిగించారు. ప్రస్తుతం జూనియర్ మెడికల్ ఆఫీసర్గా అవతారమెత్తిన అలేఖ్య ముందస్తుగా లోపాయికారీ ఒప్పందం చేసుకున్న సంస్థల నుంచి మందుల కొనుగోళ్ళకు ప్రయత్నిస్తోంది. ఈమెకు కొనుగోళ్ళు చేసే అర్హత ఏమాత్రం లేదు. గత ఐదేళ్ళుగా అత్యవసర మందుల పేరుతో లోకల్ మార్కెట్ నుంచి నాసిరకం మందులను లక్షల రూపాయలకు కొనుగోలు చేసి కమిషన్ దండుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక కూడా వీరి అవినీతికి అడ్డులేకుండా పోయింది. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ప్రకారం ఫార్మసీ రూమ్లో టాబ్లెట్స్ ఇవ్వాలి, కానీ ఫార్మాసిస్ట్ డాక్టర్ ప్రొస్క్రిప్షన్ లేకుండా వారి బంధువులకు, స్నేహితులకు, ఇతర సహో ఉద్యోగుల ఫ్యామిలీ ఫెండ్స్ కు టాబ్లెట్స్ ఇస్తున్నారు. ఫార్మసీ రూమ్ లో మందుల డిస్ట్రిబ్యూషన్ కు సంబంధిచి అకౌంటబిలిటీ లేదు. డాక్టర్ అలేఖ్య అండ్ టీం అధిక కమిషన్ ఆశించి అవసరానికి మించి మందులు కొనుగుళ్ళు కు రెకమెండ్ చేస్తున్నారు. అధికంగా కొనుగోలు చేసిన మందులు పేషెంట్స్కు ఉపయోగానికి మించి చాలా మందులు అనగా 10 నుంచి 20 లక్షల మందులు ప్రతి సంవత్సరం కాలపరిమితి ముగిసిపోయి వృథా అవుతున్నాయి ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెస్ట్ కు సంబంధించి దాదాపు 10 లక్షల రూపాయల కెమికల్ కొనుగోలు చేస్తున్నారు. ఆరోగ్య కేంద్రంలో తక్కువ రేట్స్తో పేషెంట్స్కు ల్యాబ్ టెస్ట్ చేస్తారు. ఈ కెమికల్స్ వలన ఆరోగ్య కేంద్రంలో బ్లడ్ టెస్ట్ చేయడం వలన దాదాపు 5 లక్షల రూపాయలు పేషెంట్స్ నుంచి కాష్ రూపములో వసూలు కావాలి. కానీ వేల రూపాయలు మాత్రమే వసూళ్లు వస్తున్నాయి. కారణం బ్లడ్ టెస్ట్ చాలా వరకు బయట నుంచి బ్లడ్ సాంపిల్స్ ను తీసుకొని బ్లడ్ టెస్ట్ చేసి లక్షల రూపాయలు డందుకుంటున్నారు. యూనివర్సిటీ ఆరోగ్య కేంద్రంలో డెవలప్మెంట్ ఫండ్ అకౌంట్ ఉన్నదీ, ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెస్ట్ వసులు చేసిన బిల్స్ అమౌంట్ మరియు ఎక్సరే ఫిలిమ్స్ కాస్ట్ అమౌంట్లను చలానా రూపంలో అకౌంట్లో వేస్తారు. ఈ డెవలప్మెంట్ అకౌంట్ లావాదేవాల్లో చాలా అవకతవకలు జరుగుతున్నాయి. ప్రస్తుతం జూనియర్ మెడికల్ ఆఫీసర్గా అవతారమెత్తిన డాక్టర్ అలేఖ్య కి యూనివర్సిటీ ఆరోగ్య కేంద్రానికి సమీపంలో క్వార్టర్స్ ను ఉచిత అద్దె, ఎలక్ట్రిసిటీ, వాటర్తో అలాట్ చేసారు. కారణం రౌండ్ ది క్లాక్ (24 గంటలు ఎమర్జెన్సీ పేషెంట్స్ కు అందుబారులో ఉండటానికి. కానీ డాక్టర్ గత నాలుగు సంవత్సర కాలంలో ఎమర్జెన్సీ పేషెంట్స్కు ఏరోజు అందుబాటులో ఉండరు. డాక్టర్ 15 రోజులు నుంచి 20 రోజులు సెలవు పై వెళ్లిన మేడమ్ గారికి ఆఫీస్ క్లర్క్ శాలరీ బిల్ పాస్ చేస్తారు. డాక్టర్ గారే కాకుండా ఆరోగ్య కేంద్రంలో ఇతర ఉద్యోగులు 15 నుంచి 20 రోజులు సెలవు పై వెళ్లినా కూడా వారికీ ఆఫీస్ క్లర్క్ ప్రవీణ్ కుమార్ రెడ్డి గారు యూనివర్సిటీ అధికారులకు తెలపకుండా శాలరీ బిల్స్ పాస్ చేస్తున్నాడు. 8. ఆఫీస్ క్లర్క్ ప్రవీణ్ కుమార్ రెడ్డి ఆఫీస్ ఫైల్స్, హెల్త్ సెంటర్ డెవలప్మెంట్ అకౌంట్, మందుల కొనుగులకు సంబంధిచిన బిల్స్ ఇతర ఆఫీస్ ఫైల్స్ ఏవి కూడా సరిగా మైంటైన్ చేయడం లేదు. ఆఫీస్ క్లర్క్ ఆరోగ్య కేంద్రం లో జరిగే అవకతవకల పైన యూనివర్సిటీ అధికారులకు తెలియచేసిన దాఖలాలు లేవు. పైన సూచించిన అంశాల పైన ఉన్నతస్థాయి విచారణ కమిటీని ఏర్పాటు చేసి లోతుగా విచారణ జరపి, తప్పు చేసిన అధికారులను వెంటనే విధులనుంచి తొలగించాలని రామానాయుడు డిమాండ్ చేశారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్ష

పార్కింగ్ ప్రాంతాల కోసం కార్యాచరణ ప్రణాళిక

టీటీడీ ఈవో జె శ్యామలరావు

విశాలాంధ్ర - తిరుమల కల్చరల్: తిరుమల శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు అక్టోబరు 4 నుంచి 12వ తేదీ వరకు జరగనున్న శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలను దృష్టిలో ఉంచుకుని టీటీడీ ఈవో జె శ్యామలరావు, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరితో కలిసి వివిధ శాఖల అధికారులతో ఏర్పాట్ల పురోగతిని సమీక్షించారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో శుక్రవారం సాయంత్రం సమీక్షా సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో జేఈవో వీం బ్రహ్మం, సివిఎస్వో శ్రీధర్ పాల్గొన్నారు. అక్టోబరు 8న గరుడసేవ రోజున అదనపు పార్కింగ్ ప్రాంతాల ఏర్పాటుకు కార్యాచరణ రూపొందించాలని విజిలెన్స్ అధికారులను ఈవో ఆదేశించారు. అదనపు పార్కింగ్ ప్రాంతాల కోసం ప్రణాళికలు సిద్ధం చేయడంతో పాటు, బందోబస్తు, అదనపు సిబ్బంది, సీసీటీవీ, అదనపు లగేజీ సెంటర్ ఏర్పాట్ల కోసం స్థానిక పోలీసులతో సమన్వయం చేసుకోవాలని ఈవో ఆదేశించారు. అనంతరం ఇంజినీరింగ్ పనుల పురోగతి, రవాణా, వసతి, నీరు, అన్నప్రసాదాల పంపిణీ, సరిపడా శ్రీవారి సేవకుల ఏర్పాటు, ఉద్యానవన విభాగం అలంకరణలు, తగినన్ని లడ్డూల నిల్వ, ఉత్తమ కళా బృందాల ఎంపిక, అదనపు మరుగుదొడ్లు తదితర అంశాలపై ఈవో సమీక్షించారు. తనిఖీలు అంతకుముందు లడ్డూ కాంప్లెక్స్, పోటును సంబంధిత అధికారులతో కలిసి ఈవో పరిశీలించారు. ఈ తనిఖీల్లో భాగంగా లడ్డూ కౌంటర్లు, బూందీ పోటులను సందర్శించి లడ్డూల పంపిణీ, బూందీ తయారీ ప్రక్రియను పర్యవేక్షించి శ్రీవారి పోటుపై సేఫ్టీ ఆడిట్ చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిఈ సత్యనారాయణ, ఆలయ డిప్యూటీ ఈవోలోకనాథం, ఈఈ1 సుబ్రహ్మణ్యం, రవాణా విభాగం జీఎం శేషారెడ్డి, సిపిఆర్వో డాక్టర్ టీ. రవి తదితరులు పాల్గొన్నారు.

నాయకల్లు సుంకన్నకి డాక్టరేట్

విశాలాంధ్ర - తిరుపతి : ప్రభుత్వ జూనియర్ కళాశాల గూడూరు కర్నూలు జిల్లాలో జూనియర్ లెక్చరర్ ఇన్ లైబ్రరీ'సైన్స్గా పనిచేయుచున్న నాయకల్లు సుంకన్నకు కుప్పం ద్రవిడ యూనివర్సిటి గ్రంథాలయ సమాచార శాస్త్ర శాఖలో పరిశోధక విద్యార్థికి డాక్టరేట్ పట్టాను ప్రధానము చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి నాగేశ్వరరావు తెలిపారు. ఆయన మాట్టాడుతూ ఆచార్యులు డాక్టర్ ఆవినేని కిషోర్ పర్యవేక్షణలో "అప్లికేషన్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ ఇన్ డిగ్రీ కాలేజి లైబరీస్ ఆఫిలియేటెడ్ టు రాయలసీమ యూనివర్సిటీ, కర్నూలు జిల్లా ఆం((ధ్రప్రదేశ్" అనే అంశముపై పరిశోధన గ్రంథము సమర్పించారు. నాయకల్లు సుంకన్న మాట్లాడుతూ తన పిహెచ్డి పట్టాకు సహకరించిన గురువు సూపర్వైజర్ మరియు గైడ్ ఆచార్య డాక్టర్ ఆవినేని కాషోర్ కి డాక్టర్ మద్దయ్యకిగురువు టి. సిద్దారెడ్డికి యూనివర్సిటి వైస్ ఛాన్సులర్ ఫొఫెసర్ దొరస్వామికి నా కూతురు దివ్యప్రణతి వారికి మరియు మిత్రుడు రమణా రెడ్డికి ధన్యావాదములు తెలియజేసారు.

వేద విద్యార్థులు సనాతన హైందవ ధర్మానికి సంరక్షకులు

ఏపి మాజీ సిఎస్ ఎల్వి సుబ్రహ్మణ్యం

ధర్మగిరిలో గణేశ నవరాత్రులలో పాల్గొన అదనపు ఈవో

విశాలాంధ్ర - తిరుమల కల్చరల్ : వేద విద్యార్థులు ఇతరులకు ఆదర్శంగా నిలవాలని,సనాతన హిందూ ధర్మ సంరక్షకులుగా వ్యవహరించి సంస్థ ఖ్యాతిని నలు దిశల వ్యాప్తి చేయాలని ఏపి మాజీ సిఎస్, టీటీడీ మాజీ ఈవో ఎల్వి సుబ్రహ్మణ్యం ఉద్ఘాటించారు. తిరుమల ధర్మగిరి వేద విజ్ఞాన పీఠంలో శుక్రవారం జరిగిన గణేశ నవాహ్నిక ఉత్సవాల్లో అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి ఏపీ మాజీ సిఎస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎల్విసుబ్రహ్మణ్యం విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ వందలాది మంది విద్యార్థులకు వేద విజ్ఞానాన్ని ప్రసాదిస్తున్న ధర్మగిరి వేద విజ్ఞాన పీఠం దేశంలోనే పురాతన విద్యాసంస్థల్లో ఒకటిగా నిలుస్తుందన్నారు. అనంతరం ఆవరణలో జరిగిన శ్రీ వీర గణపతి ఉత్సవ పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మగిరి ప్రిన్సిపాల్ కేఎస్ఎస్ అవధాని, విఎస్వో సురేంద్ర, వేద అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్14 నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకు

స్వచ్ఛతాహిసేవ కార్యక్రమాలు నిర్వహించాలి:కమిషనర్

విశాలాంధ్ర - తిరుపతి : సెప్టెంబర్ 14 నుంచి అక్టోబర్ ఒకటవ తేదీ వరకు నగరంలో నిర్వహించునున్న స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలు విజయవంతం చేయాలని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులకు పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాల నిర్వహణపై శుక్రవారం నగరపాలక సంస్థ సమావేశం మందిరంలో ఇంజినీరింగ్, హెల్త్, ప్లానింగ్ విభాగపు అధికారులతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 2024 వ సంవత్సరం సెప్టెంబర్ 14 వ తేది నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకు స్వభావ్ స్వచ్ఛత - సంస్కార్ స్వచ్ఛత అనే నినాదంతో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలు నిర్వహించునున్నామని అన్నారు. ఈ సేవా కార్యక్రమంలో భాగంగా ర్యాలీ, మారథాన్ రన్, వర్క్ షాపులు, వైద్య శిబిరాలు వంటి కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. అలాగే ఈనెల 17వ తేదీ నుంచి సంపూర్ణ స్వచ్ఛత కార్యక్రమం, స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాల్లో భాగంగా అన్ని చోట్ల పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఇందుకోసం ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది సమన్వయం చేసుకుని తగిన ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మునిసిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, డి.సి.పి. శ్రీనివాసులు రెడ్డి, డి.ఈ.లు విజయ కుమార్ రెడ్డి, సంజయ్ కుమార్, మహేష్, శ్రావణి, రాజు, రవీంద్ర రెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, మేనేజర్ చిట్టిబాబు, ఉద్యానవన అధికారి హరికృష్ణ, సర్వేయర్ కోటేశ్వరరావు, శానిటరీ సూపర్వైజర్స్ చెంచయ్య, సుమతి, మేస్త్రిలు, మస్తాన్ పాల్గొన్నారు.

వరసిద్ధి వినాయకునికి ముక్కంటి పట్టు వస్త్రాలు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: చిత్తూరు జిల్లా కాణిపాకంలో వెలసిన వరసిద్ధి వినాయకునికి శుక్రవారం శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయం తరపున పట్టు వస్త్రాలు సమర్పించారు. శ్రీకాళహస్తి శాసన సభ్యులు బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్ వీఎస్ఎన్ మూర్తి ఈ పట్టు వస్త్రాలను కాణిపాకం ఆలయ అధికారులకు సాంప్రదాయబద్ధంగా అందజేశారు. కాణిపాక వరసిద్ధి వినాయకుని బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయం తరపున ప్రతియేటా పట్టు వస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఈ ఏడాది కూడా వరసిద్ధునికి ముక్కంటి ఆలయం తరపున పట్టువస్త్రాలు అందించారు. పట్టు వస్త్రాలు తీసుకెళ్లిన శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్ రెడ్డికి పూతలపట్టు శాసనసభ్యుడు మురళీమోహన్ స్వాగతం పలికారు. అనంతరం మంగళ వాయిద్యాలు, మేళ తాళాల మధ్య ఆలయ సాంప్రదాయాలతో వరసిద్ధి వినాయకస్వామికి పట్టు వస్త్రాలు అందజేశారు. అనంతరం స్వామి వారి దర్శించుకున్నారు. ఆలయ వేదపండితులు ఈయనకు ఆశీర్వచనం ఇచ్చి స్వామి వారి శేషవస్త్రంతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి కుటుంబ సభ్యులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థి దశనుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలి: ఆర్ఐఓ

విశాలాంధ్ర -ఏర్పేడు: విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో చదువుకుంటే ఉన్నత శిఖరాల అధిరోహిస్తారని కళాశాల ప్రిన్సిపల్, తిరుపతి ఆర్. ఐ. ఓ.జీ.వి. ప్రభాకర్ రెడ్డి ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో విద్యార్థులకు సందేశం ఇచ్చారు. శుక్రవారం పాపానాయుడుపేట జూనియర్ కళాశాలలో నూతనంగా ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులకు, సీనియర్ ఇంటర్ విద్యార్థులు ఆనవాయితీగా ప్రతి సంవత్సరం స్వాగత కార్యక్రమం ఏర్పాటు చేస్తుంటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తిరుపతి క్రాంతి ఇంటర్మీడియట్ అధికారి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ కొత్త విద్యార్థులకు స్వాగత కార్యక్రమం ఏర్పాటు చేయడం పట్ల ఆయన సీనియర్ విద్యార్థులను అభినందించారు. అలాగే ఆత్మీయ అతిథి తంబా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ... కాలేజీ గ్రౌండ్ ఏడడుగుల లోతులో ఉండేదని,అనేకమంది దాతలు సహాయంతో, మట్టి తోలించి కాలేజీ బాగు కోసం నిరంతరం శ్రమిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ ను అభినందించారు. వ్యవసాయం జీవనాధారంగా గల విద్యార్థులు ఇక్కడ ఎక్కువ మంది చదువుతున్నారని, బాగా చదివి ఉన్నత స్థానానికి చేరుకోవాలని పిలుపునిచ్చారు. అంతేకాకుండా విలువలతో కూడిన విద్య అందించడంలో పాపానాయుడుపేట జూనియర్ కళాశాల మొదటి స్థానంలో ఉందన్నారు. అన్నారు. ఈ కార్యక్రమంలో మదనపల్లి మెరిటాస్ విద్యాసంస్థ అధినేత విజయ శేఖర్ రెడ్డి, మరియు డైరెక్టర్ శశికళ పాపానాయుడుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత,నంద్యాల వెంకట సుబ్బమ్మ , కే. సువర్ణ వందన, అధ్యాపకులు ఎస్.ఉమా, శంకరప్ప, అమరేశ్వర రెడ్డి, షమీర్, సోమశేఖర్ బాబు, వెంకట సురేష్, రామాంజులు, రాఘవరెడ్డి, శ్రీమన్నారాయణ, నారాయణ బాబు, బోధనేతర సిబ్బంది వై. వి. రాధ, సాయి తేజ విద్యార్థులు పాల్గొన్నారు.